www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా...

బుధవారం 6 - 8 - 2025 | సంపుటి : 1 | సంచిక : 31 | పేజీలు : 12 | వెల : 5/- | తెలంగాణ/ఆంధ్రప్రదేశ్






## ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వం

- బీఆర్ఎస్ అవినీతి 'కాళేశ్వరం' నివేదిక ద్వారా తెలిసింది
- రాష్ట్రంలో 5 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ
- పేద రైతుల కోసం భూభారతి తీసుకొచ్చాం
- మంత్రి పొంగులేటి

2లో...

## ప్రతిపక్షాలు తమను తామే దెబ్బతీసుకున్నాయి..

'ఆపరేషన్ సిందూర్'పై చర్చలో ఓటమి పాలయ్యారు

- ప్రశ్నించే ఒకే ఒక్క అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు...
- దేశ భద్రత విషయంలో వారిది నిర్లక్ష్య ధోరణి
- ఇటువంటి ప్రతిపక్ష నేతలను ఇంకెక్కడా చూడలేదు
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ..



2లో...



2లో...

## ధరాలీలో జల ప్రళయం..

**10 మంది సైనికుల గల్లంతు...!**

## పేపర్ బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలి..



2లో...

అమెరికా, యూకే, జర్మనీ, ఇటలీ లాంటి దేశాలు ఓటింగ్ మిషన్‌ను వద్దనుకున్నాయి

ఈవీఎంలపై దేశ ప్రజల్లో కూడా అనేక అనుమానాలు ఉన్నాయి - ఎన్నికల సంఘానికి కేటీఆర్ విజ్ఞప్తి

## సుప్రీంలో ముగిసిన విచారణ..

### తెలంగాణలో స్థానికత వ్యవహారంపై తీర్పు రిజర్వు...



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ స్థానికత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పదో తరగతి తర్వాత రెండేళ్లు బయట ఉంటే స్థానికత వర్తించదన్న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి.. తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. స్థానికత అంటే ఏమిటి? ఎవరు దీని పరిధిలోకి వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును విద్యార్థులు సుప్రీంలో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రెండేళ్లు బయట ప్రాంతంలో చదువుకోవడానికి వెళితే తప్పేంటని విచారణ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. పదేళ్లు స్థానికంగా ఉండి.. రెండేళ్లు బయటకు వెళితే స్థానికత ఎలా కోల్పోతారని ప్రశ్నించారు. 2014లో నిబంధనలు తీసుకొచ్చారు.. అప్పుడు ఈ రెండు, నాలుగేళ్ల సమయం గురించి అందులో ప్రస్తావించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. 2024లో తీసుకొచ్చిన నిబంధనను 2028కి వర్తింపజేస్తే సరిపోతుందని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది.

## పీఎం కిసాన్ సాయం పెంపు

కౌలు రైతులకు వర్తింపుపై కేంద్రం క్లారిటీ

ఈపథకానికి రైతులు సాగు భూమి కలిగి ఉండడమే ప్రధాన అర్హత


మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

2లో...



## జస్టిస్ పీసి ఘోష్‌ను అవమానిస్తున్నారా..?

- ప్రజాస్వామ్య వ్యవస్థలపై బీఆర్ఎస్‌కు చులకనభావం
- చట్టసభలు, న్యాయస్థానాలంటే కూడా గౌరవం లేదు
- జ్యుడీషియల్ కమిషన్ అంటే కూడా లెక్కలేదు
- కాళేశ్వరం అవకతవకలన్నింటిపై కమిషన్ సమగ్రంగా విచారణ జరిపింది
- ప్రజలను ఇంకెన్ని సార్లు మోసం చేస్తారు?
- కొడంగల్ ప్రాజెక్ట్‌కు ఉమ్మడి రాష్ట్రంలోనే జీవో ఇచ్చారు : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




2లో...

## పీ-4 కార్యక్రమం దేశానికి ఆదర్శం

**ఈ నెల 19 నుంచి అమలు చేయాలని నిర్ణయం - మార్గదర్శుల ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదనే**

**ప్రజలే ఆస్తిగా జీరో పావర్టీ మిషన్ అమలు చేస్తున్నాం : ఏపీ సీఎం చంద్రబాబు**



విశ్వంభర, అమరావతి: పేదరిక నిర్మూలనకు రాష్ట్రంలో చేపట్టిన పీ-4 కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. బంగారు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యమని చెప్పారు. సచివాలయంలో పీ-4 కార్యక్రమంపై మంత్రి పయ్యావుల కేశవ్, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీ-4 కార్యక్రమాన్ని ఈ నెల 19 నుంచి అమలు చేయాలని నిర్ణయించినట్లు సీఎం తెలిపారు. మార్గదర్శుల ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదన్నారు. "మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదలకు కొండంత అండ అవుతుంది. బంగారు కుటుంబాలకు కావాల్సింది భావోద్వేగాలతో కూడిన బంధం, చేయూత మాత్రమే. సీఎస్ఆర్ నిధులతో బిల్ గేట్స్‌తో పాటు వేదాంత లాంటి సంస్థలు పనిచేస్తున్నాయి. వీటికి మించి కుటుంబాలను ఆదుకోవడటమే లక్ష్యంగా పీ-4 కార్యక్రమం చేపట్టాం. ప్రజలే ఆస్తిగా జీరో పావర్టీ మిషన్ అమలు చేస్తున్నాం.

**అలాంటి వారిని గుర్తించాలి..**

మంచి కార్యక్రమాలు అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నిస్తారు. ప్రజల్లో దీనిపై వ్యతిరేకత తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తారు. గతంలో జన్మభూమి, శ్రమదానం ఇలా ఏ కార్యక్రమం చేపట్టినా ఇదే విధంగా విమర్శించారు. కొందరికి ఆర్థిక వనరులున్నా పేదల్ని ఆదుకోవడానికి మనసు రాదు. కొందరికి మనసు ఉన్నా సమయం ఉండకపోవచ్చు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు అందుకుంటూనే బంగారు కుటుంబాలకు పీ-4 ద్వారా అదనపు సాయం అందుతుంది. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు, పారిశ్రామిక వేత్తలను కలిసి వారిలో ఆలోచనలు రేకెత్తించాలి.

**11 ప్రశ్నలు.. ఏఐతో విశ్లేషణ..**

ఇప్పటి వరకు 9,37,913 బంగారు కుటుంబాల ఎంపిక పూర్తయింది. 1,03,938 మందిని మార్గదర్శులుగా గుర్తించాం. రాష్ట్రవ్యాప్తంగా 10లక్షల కుటుంబాలకు ఉన్న అవసరాలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించాం. 11 ప్రశ్నలతో వివరాలు నమోదు చేసి ఏఐతో విశ్లేషించాం. 31 శాతం మంది ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, 22 శాతం మంది వైద్య చికిత్సలకు సంబంధించి, 9 శాతం మంది తమ చిన్న చిన్న వ్యాపారాలను మరింత పెంచుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడంతోపాటు గ్రామాలు, మండలాల వారీగా దత్తత తీసుకునేందుకు కొందరు ముందుకొస్తున్నారు. నేను 250 కుటుంబాలను దత్తత తీసుకోవడంతోపాటు ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు అమలు చేస్తున్నాం"అని సీఎం చంద్రబాబు తెలిపారు.

## కాళేశ్వరం నివేదిక లీకులను తాము పట్టించుకోను

**అసెంబ్లీలో కాళేశ్వరం నివేదిక పెట్టిన తర్వాతే స్పందిస్తాం**

బీజేపీ చీఫ్ రాంచందర్‌రావు

2లో...

## రాజీవ్ స్వగృహ ప్లాట్లకు భారీ స్పందన..

**సర్కార్‌కు రూ.100 కోట్ల ఆదాయం**

**గరిష్టంగా చదరపు గజానికి 46,500 పలికిన ధర**

**రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం**

2లో...



## దిగజారి బతకలేను.. మళ్లీ త్యాగానికైనా సిద్ధం

- పార్టీలో చేరినప్పుడు మంత్రి పదవి ఇస్తామన్నారు
- పదవులను అడ్డుపెట్టుకుని సంపాదించేవాడిని కాదు
- ఎవరి కాళ్లో మొక్కి పదవి తెచ్చుకోవాలనుకుకోవట్లేదు
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు



విశ్వంభర, మునుగోడు: ఎల్బీనగర్ నుంచి పోటీ చేస్తే మంత్రి పదవి వచ్చేదని.. కానీ, నియోజకవర్గ ప్రజల కోసమే మునుగోడు నుంచి పోటీ చేసినట్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తనకు పదవి వస్తే అది ప్రజలకే ఉపయోగపడుతుందని.. అందరిలా పైరవీలు చేస్తూ దోచుకునేవాడిని కాదని వ్యాఖ్యానించారు. రాజగోపాల్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి కావాలా?మునుగోడు ప్రజలు కావాలా? అంటే మునుగోడు ప్రజలే కావాలని కోరుకుంటానన్నారు."పార్టీలో చేరినప్పుడు మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవులను అడ్డుపెట్టుకుని సంపాదించేవాడిని కాదు. నా స్వార్థం కోసం మంత్రి పదవిని అడగటం లేదు. మంత్రినైతే మంచి జరుగుతుం దని మునుగోడు ప్రజలు భావిస్తున్నారు. భువనగిరి ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవి ఇస్తారా? ఇవ్వరా? అనేది పార్టీ అధిష్ఠానం ఇష్టం. ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లకు, నా జూనియర్లకు కూడా ఇచ్చారు. ఎవరి కాళ్లో మొక్కి పదవి తెచ్చుకోవాల నుకుకోవట్లేదు. దిగజారి బతకడం నాకు తెలియదు. మళ్లీ త్యాగానికైనా సిద్ధం.. ఎంత దూరమైనా మునుగోడు ప్రజల కోసం వెళ్తా. నా నియోజకవర్గ ప్రజలు తలదించుకునే పని ఏనాడూ చేయను" అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

# ధరాలీలో జల ప్రళయం..
# 10 మంది సైనికుల గల్లంతు!

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర,ధరాలీ:** ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలోని ధరాలీ మంగళవారం సంభవించిన మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. ఇప్పటికే నలుగురు ప్రాణాలు కోల్పోగా.. తాజాగా దాదాపు 10 మంది సైనికులు వరదనీటిలో గల్లంతైనట్లు తెలుస్తోంది. వరదకు తీవ్ర ప్రభావితమైన ధరాలీ గ్రామానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలోనే ఆర్మీ బేస్ క్యాంప్ ఉంది. హర్షిల్ ఆర్మీ క్యాంప్‌నకు దిగువన ఉన్న సైనికులు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయినట్లు సమాచారం. వారి కోసం సైన్యం గాలింపు చర్యలు చేపట్టింది. మరోవైపు ధరాలీ గ్రామంలో అడుగుల మేర బురద పేరుకుపోవడంతో.. సైన్యం రంగంలోకి దిగింది. 150 మంది సభ్యుల బృందం, ఎన్‌డీఆర్ఎఫ్‌తో కలిసి సహాయక చర్యలు చేపడుతోంది.ఓ వైపు తమ బృంద సభ్యులు గల్లంతైనప్పటికీ.. నిరాఘాటంగా సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తోంది. ఎక్కడికక్కడ బురద మేటలు వేయడం, ఇళ్లు, దుకాణాలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది.మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

**సిద్ధంగా ఎయిర్‌ఫోర్స్..**

మరోవైపు, సహాయక చర్యలకు చేపట్టేందుకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ కూడా సిద్ధమైంది. ఛండీగఢ్ ఎయిర్‌బేస్ నుంచి చినూక్ ఎంఐ–17 వీ5, చీతా, ఏఎల్‌హెచ్ హెలికాప్టర్లను స్టాండ్ బైగా ఉంచింది.అక్కడి పరిస్థితుల మేరకు సహాయక చర్యలకు అవసరమైన సామగ్రిని సిద్ధం చేసింది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే సైనిక హెలికాప్టర్లు బయల్దేరనున్నాయి.



# ప్రతిపక్షాలు తమను తామే దెబ్బతీసుకున్నాయి

## ప్రధానమంత్రి నరేంద్ర మోడీ



మొదటిపేజీ తరువాయి...

ఢిల్లీ: 'ఆపరేషన్ సిందూర్'పై చర్చకు పట్టుబట్టి విపక్షాలు తమను తామే దెబ్బతీసుకున్నాయని ప్రధాని మోడీ అన్నారు. చర్చల సమయంలో ప్రతిపక్ష నేతలు ప్రభుత్వం ముందు నిలవలేక ఓటమి పాలయ్యారన్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి వచ్చిన ఒకేఒక్క అవకాశాన్ని కూడా వారు వినియోగించుకోలేకపోయారని వ్యంగ్యాస్త్రాలు విసిరారు. ఆ సమయంలో దేశ భద్రత విషయంలోవారి నిర్లక్ష్య ధోరణి.. సొంత పార్టీ నేతల్లోనే అభిప్రాయ భేదాలు బయటపడ్డాయన్నారు. ఇటువంటి ప్రతిపక్ష నేతలను ఇంకెక్కడా చూడలేదన్నారు.ఎన్డీఏ పార్లమెంటరీ పార్టీసమావేశంలో మాట్లాడుతూ మోడీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎప్పుడూ రాజ్యాంగం గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు తాము అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ జమ్మూకశ్మీర్‌లో దానిని అమలుచేయలేదని మోడీ విమర్శించారు. కానీ ఎన్డీఏ ప్రభుత్వం జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసి..రాజ్యాంగాన్ని నిజంగా అ మల్లోకి తీసుకువచ్చిందన్నారు. తమ ప్రభుత్వం ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం, ఆపరేషన్ సిందూరంవంటి చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటుంటే ప్రతిపక్షాలు మాత్రం తమ చర్యలతో తమను తామే దెబ్బతీసుకుంటున్నాయని అన్నారు.పహల్గాం దాడి,ఆపరేషన్ సిందూర్‌లపై లోక్‌సభలో ఇటీవల చర్చలు జరిగిన విషయం తెలిసిందే.చర్చల్లో విపక్షాలు ఉభయసభల్లో ప్రభుత్వాన్ని నిలదీశాయి. ముఖ్యంగా భద్రతలో, విదేశాంగ విధానంలో వైఫల్యాలను ప్రస్తావించి ప్రభుత్వ జవాబుదారీతనాన్ని ప్రశ్నించాయి.విపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ తదితరులు ప్రభుత్వంపై విరుచుకుపడగా.. అధికార పక్షం వైపు నుంచి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, మరో మంత్రి నడ్డాలు వారి విమర్శల్ని గట్టిగా తిప్పికొట్టారు. దీంతో ఉభయసభల్లో వాగ్వాదాలు చోటుచేసుకున్నాయి. చివర్లో మోదీ సవివరంగా స్పందించి..విపక్షాల పాలనలో జరిగిన తప్పిదాలను తనదైన శైలిలో ప్రస్తావించార ఉగ్రవాదుల ఏరివేతలో ఆపరేషన్ సిందూర్, ఆపరేషన్ మహాదేవ్ కీలకపాత్ర పోషించాయని స్పష్టంచేశారు. భారత్-పాక్ యుద్ధాన్ని నిలువరించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెప్పడంపై విపక్షాల విమర్శలకు సమాధానమిచ్చారు. ఆ సమావేశాల్లో విపక్షాల తీరును నేడు నిర్వహించిన ఎన్డీఏ సమావేశంలో మోదీ విమర్శించారు.

# రాజీవ్ స్వగృహ ప్లాట్లకు భారీ స్పందన..

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, మేడ్చల్‌: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని బహదూర్‌పల్లి ప్రాంతంలోని 68 ప్లాట్ల వేలానికి భారీ స్పందన లభించిందని రాజీవ్ స్వగృహ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతం తెలిపారు. ప్లాట్లకు సంబంధించిన బహిరంగ వేలం ప్రక్రియను మంగళవారం చేపట్టారు.

. రాత్రి 8 గంటల వరకు 50 ప్లాట్లకు సంబధించి నిర్వహించిన వేలం పాటలో గరిష్టంగా చదరపు గజానికి 46,500 ధర పలికింది. వేలం నిర్వహించిన 50 ప్లాట్ల విక్రయానికి సంబంధించి సుమారు రూ. 100 కోట్ల మేర ఆదాయం వచ్చినట్లు ఎండీ తెలిపారు. .

అవుటర్ రింగ్ రోడ్‌కు అతి సమీపంలోని ఈ భూములను కొనుగోలు చేయడానికి సుమారు 119 మంది బిడ్డర్లు పాల్గొన్నారు. 200– 1000 చదరపు గజాల విస్తీర్ణంలో

ఉన్న ప్లాట్లలో, కార్నర్ ప్లాట్‌కు రూ. 30 వేలు, ఇతర ప్లాట్లకు రూ. 27 వేలు ఆఫ్ సెట్ ధరగా నిర్ణయించారు. ఈ ప్లాట్ల కొనుగోలు ఒక్కో ప్లాట్ కోసం దాదాపు 30 మంది వరకు పోటీ పడ్డారు. కార్నర్ ప్లాట్లకు మంచి డిమాండ్ రేటు పలికింది.

# పీఎం కిసాన్ సాయం పెంపు




మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, ఢిల్లీ: పీఎం–కిసాన్ పథకం పరిధిని విస్తరించడం, అందించే ఆర్థిక సాయం పెంపునకు సంబంధించి ఎలాంటి ప్రతిపాదనా ప్రస్తుతం తమ పరిశీలనలో లేదని కేంద్రం పార్లమెంట్‌కు వెల్లడించింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. రైతులకు ఏటా ఒక్కో విడత రూ. 2 వేలు చొప్పున మూడు విడతల్లో రూ. 6 వేల సాయం అందించే పీఎం కిసాన్ పథకాన్ని కేంద్రం 2019లో ప్రారంభించింది. ఈ మొత్తాన్ని నగదు బదిలీ కింద అందిస్తోంది. ఇప్పటివరకు రైతులకు 20 వాయిదాల్లో రూ. 3.9 లక్షల కోట్లకు పైగా అందజేసినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం పీఎం–కిసాన్ పథకం పరిధిని విస్తరించడం గానీ, లేదా అందించే సాయాన్ని పెంచే అంశంపై ఎలాంటి ప్రతిపాదన పరిశీలనలో లేదని స్పష్టం చేశారు. కౌలు రైతులు, భాగస్వామ్య సాగు రైతులను ఈ పథకంలో చేర్చే అంశంపై వచ్చిన మరో ప్రశ్నకూ సమాధానం ఇచ్చారు. ఈ పథకం ప్రయోజనాలు పొందాలంటే రైతులు సాగు భూమి కలిగి ఉండడమే ప్రధాన అర్హత అని మంత్రి తెలిపారు.

తమిళనాడులో అమలవుతున్న 'ఉజ్వాన్ యాప్' తరహాలో రైతులకు వాతావరణ సమాచారం, మార్కెట్ వివరాలు, సలహాలు అందించే విధంగా కేంద్రం ఏదైనా యాప్‌ను ప్రవేశపెట్టనుందా? అని అడిగిన ప్రశ్నకు.. ప్రస్తుతం అటువంటి ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదన్నారు. అయితే, వ్యవసాయానికి సంబంధించిన సందేహాలు, సలహాలకు 'కిసాన్ కాల్ సెంటర్'ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సేవల కోసం రైతులు 1800–180–1551 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చెయొచ్చని, ప్రాంతీయ భాషల్లోనే సమాధానాలు లభిస్తాయని పేర్కొన్నారు.

# ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే
# పేదల ప్రభుత్వం..

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, ఖమ్మం:** కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గత ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ద్వారా తెలిసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాళేశ్వరం కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తిరుమ లాయపాలెం మండలంలో మంత్రి పర్యటించారు.

పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 5 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు.

రాబోయే ఏ ఎన్నికల్లో అయినా ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదవాడి కోసం అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలానికి ఒక ఐటీఐ కళాశాల మంజూరు చేశామని, ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునికీకరణ చేస్తున్నామని వెల్లడించారు. మండల అభివృద్ధికి రూ. 75 కోట్లు కేటాయించామన్నారు. పేదవాడి ఆకలి తీర్చే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ధ




రణి పోర్టల్‌ను రద్దు చేశామని.. పేద రైతుల కోసం భూభారతి తీసుకొచ్చామన్నారు. బాలికలకు సైకిళ్ల పంపిణీ..

ఏదులాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, 1,59, 60వ డివిజన్లకు చెందిన 8వ తరగతి బాలికలకు మంత్రి సైకిళ్లు పంపిణీ చేశారు. పీఎస్‌ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి స్కూల్ విద్యార్థులతో పాటు జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా సైకిళ్లు ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

# కాళేశ్వరం నివేదిక లీకులను తాము పట్టించుకోను : బీజేపీ చీఫ్

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, హదరాబాద్‌: తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పై విచారణ కమిషన్ నివేదిక పై హాట్ టాపిక్ గా చర్చ కొనసాగుతోంది. అధికార, ప్రతిపక్షాలు ఈ అంశంపై మాటల యుద్ధం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ బీజేపి అధ్యక్షుడు రాంచందర్ రావు స్పందిస్తూ.. కాళేశ్వరం నివేదిక లీకులను తాము పట్టించుకోమని స్పష్టం చేశారు. ప్రభుత్వం.. కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తర్వాతే దానిపై స్పందిస్తామని చెప్పుకొచ్చారు. అలాగే ప్రస్తుతం వచ్చిన కాళేశ్వరం నివేదిక ప్రభుత్వానిదా.



కాంగ్రెస్‌దా అని ఆయన ప్రశ్నించారు. తాము మొదటి నుంచి కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని చెబుతూనే ఉన్నామని, కాళేశ్వరం నిర్మాణంలో అవకతవకలపై సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నామని రాంచందర్ రావు అన్నారు. అలాగే బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని.. బీసీ జాబితాలో ముస్లింలను కలపొద్దని రాంచందర్ రావు పెద్దపల్లి కేంద్రంగా చెప్పుకొచ్చారు.



# పేపర్ బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలి..

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ఈవీఎంలపై అనుమానాలు వస్తున్న నేపథ్యంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో పేపర్ బ్యాలెట్లతో ఎన్నికలు నిర్వహించాలని భారత ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. మంగళవారం కేంద్ర ఎన్నికల సంఘం ఆహ్వానం మేరకు కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రతినిధి బృందం ఢిల్లీలోని కమిషన్ ప్రధాన కార్యాలయంలో భేటీ అయింది. సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా అమెరికా, యూకే, జర్మనీ, ఇటలీ లాంటి చాలా దేశాలు కొంత కాలం వరకు ఈవీఎంలను ప్రయోగాత్మకంగా అమలు చేసినప్పటికీ ప్రజల్లో విశ్వాసం లేకపోవడంతో ఓటింగ్ మిషన్‌ను వద్దనుకున్నాయని తెలిపారు. ఈ క్రమంలోనే ఈ దేశాలన్ని తిరిగి పేపర్ బ్యాలెట్ పద్ధతికి వెళ్ళాయని వివరించారు. ఈ ఈవీఎంలపై దేశ ప్రజల్లో కూడా అనేక అనుమానాలు ఉన్నాయని, ప్రజల్లో వాటిపై విశ్వసనీయత కోల్పోయారని తెలిపారు. అందుకే త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు తర్వాత వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ పేపర్ బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని కమిషన్‌కు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. అలాగే కారు గుర్తును పోలిన 8 గుర్తుల వల్ల మాకు చాలా ఎన్నికల్లో నష్టం జరిగిందని, వాటిని వెంటనే తొలగించాలని ఎన్నికల కమిషన్‌ను కోరినట్లు తెలిపారు. ఇక ఎన్నికల సమయంలో పార్టీలు అడ్డగోలుగా హామీలు ఇస్తున్నాయని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చిందని విమర్శించారు. ఇష్టానుసారంగా ఒక వేలం పాట మాదిరి నోటికి వచ్చిన వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేసి గెలిచిందని ఆరోపించారు. ఈ విషయాలన్నీ కూడా ఈసీకి వివరించినట్లు చెప్పుకొచ్చారు. ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోకి రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండకపోతే తప్పకుండా ఆ పార్టీని శిక్షించాల్సిన బాధ్యత ఈసీ మీద ఉందన్నారు.

# జస్టిస్ పీసి ఘోష్‌ను అవమానిస్తున్నారా..?

మొదటిపేజీ తరువాయి...

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: ప్రజాస్వామ్య వ్యవస్థలపై బీఆర్ఎస్‌కు చులకనభావం ఉందని.. చట్టసభలు, న్యాయస్థానాలంటే కూడా గౌరవం లేదని.. వాటి మీద నమ్మకం కూడా లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి సారథ్యంలో నియమించిన జ్యుడీషియల్ కమిషన్ అంటే కూడా లెక్కలేదని తెలిపారు. ప్రజలు గత ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఇప్పటికీ వాళ్లలో మార్పు రాలేదని.. తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పుకోవాలనే సోయి కూడా లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడిన ఎన్డీఎస్ఏ మీద వారికి నమ్మకం లేదని తెలిపారు. మేడిగడ్డను కుంగబెట్టిన దుర్మార్గులు ఇప్పుడు ఏకంగా సీనియర్ జస్టిస్ పీసి ఘోష్‌ను అవమానిస్తున్నారా..? అని ఫైర్ అయ్యారు.

కాళేశ్వరం అక్రమాలు వెలుగులోకి..


కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట గత ప్రభుత్వం ఎన్ని అవకతవకలకు పాల్పడింది.. ఎన్ని అక్రమాలకు పాల్పడిందో జ్యుడీషియల్ కమిషన్ విచారణలో బయటపడిందని ఉత్తమ్ తెలిపారు. అప్పటి సీఎం కేసీఆర్, నాటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావు భండారం బట్టబయలైందని పేర్కొన్నారు. అందుకే తేలు కుట్టిన దొంగల్లా.. హరీశ్‌రావు మళ్లీ కల్లబొల్లి కబుర్లు చెప్తున్నారని పేర్కొన్నారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలోని అంశాలను మాత్రమే ప్రభుత్వం వెల్లడించిందని.. అది రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాసిన రిపోర్టు కాదనే విషయాన్ని హరీశ్‌రావు మరిచిపోయినట్లున్నారని పేర్కొన్నారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు బదులు కాళేశ్వరం ప్రాజెక్టు ఆలోచన మొదలైనప్పటి నుంచి డిజైన్లు, నిర్మాణంలో లోపాలు, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు వరకు జరిగిన అవకతవకలన్నింటిపై కమిషన్ సమగ్రంగా విచారణ జరిపిందని తెలిపారు. ఎవరెవరు తప్పులు చేశారో.. ఎవరెవరు అందుకు బాధ్యులనే వివరాలను కూడా ఈ నివేదికలో వెల్లడించిందని పేర్కొన్నారు.

ప్రజలను ఇంకెన్ని సార్లు మోసం చేస్తారు?..

తామేం తప్పు చేయలేదని పార్టీ ఆఫీసులో తప్పులు మాట్లాడి తెలంగాణ ప్రజలను ఇంకెన్ని సార్లు మోసం చేస్తారని ఉత్తమ్ నిలదీశారు. కేసీఆర్, హరీశ్‌రావును సైతం పీసీ ఘోష్ కమిషన్ విచారించిందని.. వారిద్దరూ స్వయంగా జ్యుడీషియల్ కమిషన్ ఎదుట హాజరయ్యారని.. ఇప్పుడు పార్టీ ఆఫీసులో పెడబొబ్బలు పెడుతున్న హరీశ్‌రావు.. ఆ రోజు కమిషన్ ముందు ఎందుకు ఈ వివరాలు చెప్పుకోలేదని ప్రశ్నించారు. హరీశ్ అబద్ధపు సాక్ష్యాలు, బుకాయింపులన్నీ.. న్యాయ వ్యవస్థ ముందు అబద్ధాలుగా తేలిపోయాయని తెలిపారు. ఆయన చేసిన తప్పులన్నీ బయటపడ్డాయని పేర్కొన్నారు.

ప్రభుత్వం చర్యలపై భయం..

ఇప్పుడు ప్రభుత్వం ఈ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకుంటుందనే భయం వాళ్లను వెంటాడుతున్నదని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. అందుకే.. పార్టీఆఫీసుకు వచ్చి ఏకంగా జ్యుడీషియల్ కమిషన్‌ను తప్పుబట్టే దుర్మార్గానికి ఒడిగట్టారని ఆరోపించారు. న్యాయబద్ధ కమిషన్‌కు అపార్థాలు అంటగట్టే నీచానికి దిగజారటం కూడా మీకే చెల్లిందని ఆగ్రహంవ్యక్తం చేశారు. విచారణ కమిషన్ తేల్చిన విషయాలపై, ఇచ్చిన నివేదికపై అసెంబ్లీలో చర్చిస్తామని ప్రజా ప్రభుత్వం ప్రకటించిందని.. అది ప్రజాస్వామ్య వ్యవస్థలు, న్యాయ వ్యవస్థలు, చట్ట సభలపై తమకున్న గౌరవమని తెలిపారు. అందుకే అసెంబ్లీలో ఈ నివేదికను చర్చించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. కాళేశ్వరంలో దోషులుగా తేలిన బాధ్యులు.. అసెంబ్లీకి వచ్చి చర్చలో పాల్గొనాలని కూడా తమ ప్రభుత్వం ఆహ్వానించిందని పేర్కొన్నారు. ఫాంహౌస్‌లో మామ డైరెక్షన్, పార్టీ ఆఫీస్‌లో అల్లుడి యాక్టింగ్ ఇకనైనా ఆపాలని సూచించారు. అసెంబ్లీకి వచ్చి చేసిన తప్పులు ఒప్పుకొని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పుకోవాలని డిమాండ్ చేశారు. మీరు వేలకోట్ల అవినీతి చేస్తే ఒప్పు.. తాము విచారణ చేసి నిజాలు నిగ్గుతేలిస్తే అది రాజకీయ కక్ష సాధింపా అని ప్రశ్నించారు. కమీషన్ల కక్కుర్తితో ప్రజలను, రైతులను పదేళ్లపాటు మోసం చేశారని.. ప్రాణహిత–చేవేళ్ల ప్రాజెక్టుకు హైడ్రాలజీ



అనుమతులు ఇస్తే దాచిపెట్టారని ఆరోపించారు. నిపుణుల కమిటీ మేడిగడ్డ వద్ద బ్యారేజీల నిర్మాణం వద్దని చెపితే తొక్కిపెట్టారని.. బ్యారేజీలు ఎక్కడ కట్టాలో మీరే నిర్ణయించుకున్నారని తెలిపారు. కుంగి పోయే ప్రాజెక్ట్ కట్టినందుకు సిగ్గుపడాల్సింది పోయి హరీశ్‌రావు కొత్త రికార్డు సృష్టించారని ఎద్దేవాచేశారు. ఒక్క మాట కూడా నిజం చెప్పకుండా డూప్ ప్రెజెంటేషన్ మరోసారి ఇచ్చారని పేర్కొన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలోనే కొడంగల్‌కు జీవో..

నారాయణపేట కొడంగల్ ప్రాజెక్ట్‌కు ఉమ్మడి రాష్ట్రంలోనే జీవో ఇచ్చారని.. తమ ప్రభుత్వం ఒక్క రూపాయి బిల్లు కూడా ఇప్పటివరకు కాంట్రాక్టర్లకు ఇవ్వలేదని ఉత్తమ్ స్పష్టం చేశారు.

ఇక్కడే కాదు.. ఎక్కడైనా భూసేకరణ పూర్తి కాకుండా ఒక్క రూపాయి బిల్లు ఇవ్వకూడదని మా ముఖ్యమంత్రి స్పష్టమైన అదేశాలు జారీ చేశారు. కేబినెట్ ఆమోదం లేకుండానే మామాఅల్లుళ్లు సంతకాలు చేసుకొని కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి.. తెలంగాణ ప్రజలను దగా చేశారని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలను పాతరపెట్టి, ఆర్థికంగా లక్ష కోట్ల దుర్మార్గానికి ఒడిగట్టిన బీఆర్ఎస్ లీడర్లకు నైతికంగా మాట్లాడే హక్కు కూడా లేదని సూచించారు.

# ఆ తీర్పులో తప్పిదాలున్నాయ్..

## అలహాబాద్ హైకోర్టుపై 'సుప్రీం' ఆగ్రహం!



విశ్వంభర, ఢిల్లీః
అలహాబాద్ హైకోర్టుపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవల ఓ సివిల్ వివాదాన్ని క్రిమినల్ కేసుగా మారుస్తూ.. అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును తప్పులతడకగా పేర్కొంది. సివిల్ కేసు పరిష్కారానికి సమయం పడుతుందనే కారణంతో సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలను హైకోర్టు సమర్థించడం పట్ల అసహనం వ్యక్తం చేసింది. ఈ చర్యలు న్యాయస్థానం తనకున్న హక్కులను దుర్వినియోగం చేయడమే అని అభిప్రాయ పడింది. సివిల్ సమస్యలను పరిష్కరించడానికి క్రిమినల్ చట్టాలను ఉపయోగించలేమనే చట్టపరమైన నిబంధనల ను.. ఇరు కేసుల మధ్య ఉన్న వ్యత్యాసాలను హైకోర్టు అర్థం చేసుకుంటుందని తాము ఆశించినట్లు ధర్మాసనం పేర్కొంది. ఇకపై న్యాయమూర్తులు తీర్పులు ఇచ్చే సమయంలో ఇలాంటి అతిక్రమణలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అలహాబాద్ హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. సంబంధిత న్యాయమూర్తి ఆ తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని సూచించింది. అంతే కాకుండా ఆ తీర్పు వెలువరించిన న్యాయమూర్తి పదవీ విరమణ చేసే వరకు ఆయనకు ఎటువంటి క్రిమినల్ కేసులూ కేటాయించకుండా చూసుకోవాలని అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని ఆదేశించింది. కాగా, ఇప్పటికే పలు కోర్టులు, పోలీసులు ఆస్తి వివాదాలకు సంబంధించిన సివిల్ కేసులను క్రిమినల్ కేసులుగా మార్చడాన్ని సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు తప్పుబట్టిన విషయం తెలిసిందే.

## మైక్ కట్ చేయకుండా అవకాశం ఇవ్వండి..

# అసెంబ్లీలో చీల్చిచెండాడుతాం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: అసెంబ్లీలో కాళేశ్వరం నివేదిక పెడితే అధికార పక్షాన్ని చీల్చిచెండాడుతామని.. దమ్ముంటే కమిషన్ ఇచ్చిన 665 పేజీల నివేదికను ప్రవేశపెట్టాలని మాజీమంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సవాల్ విసిరారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో 'కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ కుట్రలు.. కమిషన్ వక్రీకరణలు, వాస్తవాలు' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు వీక్షించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు అన్ని జిల్లాల్లో డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ పాలన గాలికొదిలేశారని, రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బిల్లు కావాలంటే 10 నుంచి 12 శాతం కమీషన్లు ఇవ్వాలని.. బీజేపీ, కాంగ్రెస్ కలిసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని అన్నారు.

**అది బేస్ లెస్ రిపోర్టు.. అంతా ట్రాష్..**

తమకు నోటీసులు రాకముందే మీడియాకు లీకులు ఇస్తున్నారని.. కుట్ర పూరితంగానే కమిషన్ విచారణ జరిగినట్లు కనిపిస్తున్నదని హరీశ్‌రావు ఆరోపించారు. అసెంబ్లీలో 665 పేజీల రిపోర్ట్ బయటపెట్టాలని.. నివేదికలో తమకు నచ్చిన అంశాలను మాత్రమే బయటపెట్టారని అన్నారు. ఇది బేస్‌లెస్ రిపోర్ట్ అని.. ట్రాష్ రిపోర్టు అని ఫైర్ అయ్యారు. దేశంలో ఎన్నో కమిషన్లు వేశారని.. న్యాయస్థానాల ముందు నిలబడలేదని అన్నారు. కాటన్ బ్యారేజీ కట్టినా కమిషన్ వేసి వేధించారని.. కానీ ఆయన ప్రజల్లో గుండెల్లో నిలిచారని అన్నారు. సీఎం రేవంత్ రాష్ట్రంలో ధారావాహిక సీరియళ్లు నడుపుతున్నారని.. కేసీఆర్‌ను హింసించాలన్నదే ఆయన ఉద్దేశమని పేర్కొన్నారు. తమ్మిడిహట్టి దగ్గర నీటి లభ్యత లేదని.. జీవ సంపద ఉందని.. మహారాష్ట్ర నుంచి అభ్యంతరాలు ఉన్నాయని.. అందుకే అక్కడ ప్రాజెక్ట్ కట్టలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో తమ్మిడిహట్టి దగ్గర దమ్మెడు మట్టి ఎందుకు తీయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ వచ్చాక ఒక్క కాలువ తవ్వి, ఒక్క ఎకరానికి నీళ్లు ఇచ్చారా అని నిలదీశారు. 'రెండేళ్లలో ఢిల్లీకి కమీషన్ల మూటలు తీసుకెళ్లావు.. ప్రతిపక్షం మీద కమిషన్లు వేశావు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే రెండేళ్లలో కూడా రేవంత్‌రెడ్డి చేసేదేమీలేదన్నారు. కాళేశ్వరం ముమ్మాటికీ తెలంగాణ వరప్రదాయిని అని.. కేసీఆర్ సైతం ప్రజల గుండెల్లో దేవుడిలా నిలిచిపోతారని అన్నారు. కాళేశ్వరం కూలిందన్నోళ్లు గంధమల్లకు కొబ్బరికాయ ఎలా కొట్టారని హరీశ్‌రావు ప్రశ్నించారు. మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు తీసుకొస్తానని చెబుతున్నారని.. ఆ నీళ్లు ఎక్కడివి అని నిలదీశారు. ప్రాణహిత-చేవెళ్లలో పెట్టిన ఖర్చు రూ.3,700 కోట్లు అయితే రూ.11 వేల కోట్లు ఖర్చు అని చెబుతున్నారని.. మొబిలైజేషన్ అడ్వాన్లు పేరుమీద రూ.2 వేల కోట్లు తిన్నారని ఆరోపించారు.

**నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీనే చెప్పింది..**

తమ్మిడిహట్టి దగ్గర నీటి లభ్యత లేదని సీడబ్ల్యూసీనే చెప్పిందని.. అక్కడ 165 టీఎంసీల్లో ఎగువ రాష్ట్రాల వాటా ఉందని తేల్చిందని హరీశ్‌రావు తెలిపారు. ప్రాణహిత-చేవెళ్లకు హైడ్రాలజీ అనుమతి ఇచ్చినట్లు కాంగ్రెస్ చెప్తున్న మాట అవాస్తమన్నారు. నీటి లభ్యత లేదని ఉమాభారతి అదే లేఖలో మరో పేరాలో పేర్కొన్నారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఎలాంటి రహస్యం లేదని.. అన్ని అంశాలు డీపీఆర్‌లో ఉన్నాయని చెప్పారు. ఏడాదిలోనే కాళేశ్వరం ప్రాజెక్టుకు 11 కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల నుంచి అనుమతులు సాధించామని తెలిపారు. ఒక ప్రాజెక్టుకు కావాల్సిన అన్ని అనుమతులు వచ్చాయన్నారు. కేంద్రం, అనుమతులు ఇచ్చిన ఏజెన్సీలను కమిషన్ తప్పుబడుతున్నదా? అని నిలదీశారు. ఐదుగురు నిపుణులతో వేసిన కమిటీ సైతం మేడిగడ్డను సూచించిందని.. మేడిగడ్డ నుంచి మిడ్‌మానేరుకు నేరుగా తరలించలేమని మాత్రమే చెప్పారని వెల్లడించారు. వారి సూచనలతోనే నదీ ద్వారానే మేడిగడ్డకు తరలించాలని నిర్ణయించామని.. ఈ విషయం నిపుణుల కమిటీ తన అఫిడవిట్‌లో పేర్కొందని వెల్లడించారు. తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకున్నారని నిపుణుల కమిటీనే కమిషన్‌కు చెప్పిందని తెలిపారు.

**కేబినెట్ ఆమోదంతోనే కాళేశ్వరం నిర్మాణం..**

కాళేశ్వరం ప్రాజెక్టుకు కేబినెట్ ఆమోదం తీసుకున్నామని.. గత కేబినెట్‌లోని ఇద్దరు ఇప్పుడు మంత్రులుగా ఉన్నారని హరీశ్‌రావు తెలిపారు. కేబినెట్ కాకుండా అసెంబ్లీ అప్రూవల్ కూడా ఉన్నదని స్పష్టం చేశారు. గవర్నర్ ప్రసంగంలోనూ కాళేశ్వరం అంశం ఉందని చెప్పారు. ఆర్థికమంత్రి ప్రసంగంలోనూ కాళేశ్వరంపై మాట్లాడారన్నారు. కేసీఆర్ కాళేశ్వరంపై అసెంబ్లీలోనే చర్చ పెట్టాక ఆయన సోలో నిర్ణయం అని ఎలా అంటారని నిలదీశారు. ప్రాణహితకు జాతీయ హోదా ఇవ్వాలని సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన నెలరోజుల్లోనే ప్రధానికి కేసీఆర్ లేఖ రాశారని తెలిపారు. జాతీయ హోదా అడగడం తప్పా అని ప్రశ్నించారు. కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఏ అనుమతి ఉందని రేవంత్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టారని ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండానే పనులు ప్రారంభించారని..



ఎలాంటి అనుమతులు లేకుండానే బిల్లులు చెల్లించారని పేర్కొన్నారు. నారాయణపేట్-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ఒక్క అనుమతి ఉందో ఉత్తమ్ చూపించాలని డిమాండ్ చేశారు.

**పోలవరానికి ఎన్‌డీఎస్‌ఏ ఎందుకు పోలేదు?**

రాష్ట్రం పిలవకుండానే ఎన్‌డీఎస్‌ఏ వచ్చిందని.. ఎన్నికలకు ముందు మూడు రోజుల్లోనే నివేదిక ఇచ్చిందని హరీశ్‌రావు తెలిపారు. మూడుసార్లు కూలిన పోలవరంపై ఎన్‌డీఎస్‌ఏ ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. పోలవరం కట్టిన ప్రధాని మోడీపై చర్య తీసుకుంటారా.. పోలవరం కూలితే ఎగ్జిక్యూటివ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వానిది బాధ్యతనా.. అని నిలదీశారు. రాజకీయ కుట్రతోని ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చారని తెలిపారు. రెండు పిల్లర్లు కూలితేనే కేసీఆర్‌ది బాధ్యత అయితే.. ఎస్‌ఎల్‌బీసీ కూలిన ఘటనలో రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సుందిళ్ల, అన్నారం సేఫ్ అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసెంబ్లీలోనే చెప్పారని.. రెండు పియర్లు కుంగితే కాళేశ్వరం కూలిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. రెండు పిల్లర్ల మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని.. తమ ప్రభుత్వం రాగానే రెండు పియర్లు బాగు చేస్తామని.. కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయిని అని నిరూపిస్తామని హెచ్చరించారు.

# 'రాహుల్ వ్యాఖ్యలు సరైనవే..'

## ఇండియా కూటమి పార్టీల నేతలు!

విశ్వంభర, నేషనల్ బ్యూరోః భారత్ జోడో యాత్ర సమయంలో దేశ సైన్యంపై అనుచిత వ్యాఖ్యల విషయంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని సుప్రీంకోర్టు సోమవారం మందలించిన సంగతి తెలిసిందే. రాహుల్‌పై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు నిరాధారణమైనవని, రాహుల్ వ్యాఖ్యలు సరైనవేనంటూ ఇండియా కూటమిలోని పలు పార్టీలు అభిప్రాయపడ్డాయి. జాతీయ అంశాలను ప్రశ్నించే బాధ్యత రాజకీయ పార్టీలకు ఉంటుందని నొక్కి చెప్పాయి. ఈ అంశంపై ఇండియా కూటమిలోని పలు పార్టీలకు చెందిన సభాపక్ష నేతలు సమావేశమై చర్చించారు. "రాజకీయ పార్టీల ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధంగా న్యాయస్థానం అసాధారణమైన వ్యాఖ్యలు చేసింది. దీన్ని అన్ని పార్టీల నేతలూ అంగీకరించారు" అని కాంగ్రెస్ ఓ ప్రకటనలో తెలిపింది. రాజకీయ పార్టీలకు.. మరీ ముఖ్యంగా ప్రతిపక్ష నేతలకు జాతీయ సమస్యలపై ప్రశ్నించే బాధ్యత ఉంటుందని ఆ పార్టీ పేర్కొంది. రాహుల్ గాంధీ భారత భద్రతా దళాలను ఎంతో గౌరవిస్తారని, ప్రతిపక్ష నాయకుడిగా ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ఆయనకు ఉందని కాంగ్రెస్



ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా అన్నారు. పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. "నిజమైన భారతీయుడు ఎవరు అనేది వారు నిర్ణయించలేరు. ప్రభుత్వాన్నికి ప్రశ్నలు సంధించడం ప్రతిపక్ష నేతగా రాహుల్ బాధ్యత" అని అన్నారు. రాహుల్ ఎప్పుడూ సైన్యానికి వ్యతిరేకంగా మాట్లాడరు, ఆర్మీని గౌరవిస్తారని ప్రియాంక గాంధీ తెలిపారు.

# కేంద్ర సర్వీసుల్లోకి ఐఏఎస్ అధికారిని అలుగు వర్షిణి



విశ్వంభర, నేషనల్ బ్యూరోః ఐఏఎస్ అధికారిని అలుగు వర్షిణి కేంద్ర సర్వీసుల్లోకి అడుగుపెడుతున్నారు. నాలుగు సంవత్సరాల పాటు ఆమె కేంద్ర సర్వీసుల్లో కొనసాగనున్నారు. ఈ మేరకు కేంద్రం నియమించిన పోస్టులో మూడు వారాల్లో జాయిన్ అవ్వాలని అలుగు వర్షిణికి ఆదేశాలు అందాయి. ఇదిలా ఉంటే ప్రస్తుతం ఆమె తెలంగాణ గురుకులాల సెక్రటరీగా, గిరిజన సంక్షేమ శాఖ ఇంఛార్జ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ సెక్రటరీగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇంతలోనే కేంద్ర సర్వీసులకు వెళుతున్నారు.

# మెరుపు వరదల బీభత్సం..

## 50మందికి పైగా గల్లంతు.. కొట్టుకుపోయిన ఇళ్లు!

విశ్వంభర, నేషనల్ బ్యూరోః ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీలో మెరుపు వరదలు బీభత్సం సృష్టించాయి. ఇక్కడి ధరాలీ గ్రామంపై జలప్రవాహం విరుచుకుపడింది. ఈ ఘటనలో ఇప్పటివరకు నలుగురు మృతి చెందినట్లు సమాచారం. దాదాపు 50 మందికి పైగా శిథిలాల కింద చిక్కుకుని ఉంటారని, 20-25 హోటళ్లు, నివాసాలు కొట్టుకుపోయి ఉండొచ్చని స్థానికులు పేర్కొంటున్నారు. దీనికి సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. కుంభవృష్టి కారణంగా ఎగువ ప్రాంతమైన ఖీర్‌గఢ్ నుంచి మెరుపు వరదలు సంభవించినట్లు సమాచారం. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే ఎస్‌డీఆర్‌ఎఫ్ రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక చర్యల కోసం ఉత్తరాఖండ్ ప్రభుత్వం భారత సైన్యాన్ని అప్రమత్తం చేసింది. ఎన్డీఆర్ఎఫ్, ఐటీబీపీ బృందాలు ఘటనా స్థలానికి బయల్దేరి రంగంలోకి దిగినట్లు సమాచారం.

**ఘటనపై సీఎం ధామి దిగ్భ్రాంతి.. కేంద్రమంత్రి అమిత్ షా ఆరా**

ఈ ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల విషయంలో సీనియర్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. ఉత్తరకాశీ ప్రాంతంలోని ధరాలీలో కుండపోత వర్షాల వల్ల భారీ నష్టం జరిగిందనే వార్త చాలా బాధాకరమన్నారు. ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, జిల్లా యంత్రాంగం, సంబంధిత అధికార బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యల్లో నిమగ్నమై పనిచేస్తున్నాయని తెలిపారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలను తరలిస్తున్నట్లు తెలిపారు. బాధిత ప్రజలకు సాధ్యమైనంతగా అన్ని విధాలా సహాయం అందిస్తామన్నారు. అందరూ సురక్షితంగా ఉండాలని భగవంతుడిని



ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. మరోవైపు.. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సీఎం ధామీకి ఫోన్ చేసి స్థానిక పరిస్థితులపై ఆరా తీశారు. కేంద్రం తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

**ప్రధాని సంఘీభావం..**

ధరాలీ ఘటనలో బాధిత కుటుంబాలకు ప్రధాని మోదీ సంఘీభావం ప్రకటించారు. ముఖ్యమంత్రి పుష్కర్ ధామీతో మాట్లాడి వివరాలు ఆరా తీసినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పర్యవేక్షణలో సహాయ బృందాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలకు అన్ని విధాలా అండగా ఉంటామని ట్వీట్ చేశారు.

# ఇస్కీని యూనివర్సిటీగా ప్రకటించాలి

## గవర్నింగ్ కౌన్సిల్ తీర్మానం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: గచ్చిబౌలి ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(ఇస్కీ)ని స్వయం ప్రతిపత్తిగల విశ్వవిద్యాలయంగా ప్రకటించాలని, ఇందుకు అయిదుగురు సభ్యులతో కూడిన కమిటీ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మరొకసారి విజ్ఞప్తి చేయాలని మంగళవారం జరిగిన ఇంజనీరింగ్ స్టాఫ్ ఆఫ్ కాలేజీ అఫ్ ఇండియా గవర్ని%శీ%గ్ సమావేశంలో తీర్మానించారు. సీనియర్ ఇంజనీర్ ఎం. శ్యామ్ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సభ్యులు మాట్లాడుతూ "కలకత్తా హెడ్ క్వార్టర్‌గా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ఆధ్వర్యంలో గత నాలుగు దశాబ్దాలుగా హైదరాబాద్‌లో పని చేస్తున్న ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా ఆసియాలోనే ఒక ప్రతిష్టాత్మక శిక్షణ సంస్థగా నిలిచింది. నాటి భారత రాష్ట్రపతి వెంకటరామన్ చేతులమీదుగా స్థాపించారు. ఇప్పటికే దేశ విదేశాల్లోని వేలాది మంది ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ అభ్యర్థులకు ఎన్విరాన్ మెంట్ మేనేజిమెంట్, క్లయిమేట్ ఛేంజ్, పవర్ అండ్ ఎనర్జీ, వాటర్ రిసోర్సెస్ డెవలప్మెంట్, మైనింగ్, మేనేజిమెంట్ టెక్నాలజీ, క్వాలిటీ అండ్ ప్రొడక్షన్, ఐటీ తదితర వాటిల్లో శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్తులో విశ్వ విద్యాలయంగా ఉంటే, కాలేజ్ స్థాయి పెరగటంతో పాటుగా ప్రస్తుత సీజన్‌కు అనుగుణంగా వుండే ఎమర్జింగ్ టెక్నాలజీస్‌కు సంబంధించిన కొత్త కోర్సులు ప్రవేశపెట్టే అవకాశం ఉంటుంది. ఇందువలన భారీగా ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని, విశ్వపథంలో దూసుకుపోతున్న హైదరాబాద్ నగరానికి ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా విశ్వ విద్యాలయం మరొక మణిహారంగా నిలిచిపోయి ప్రభుత్వ ప్రతిష్ట కూడా పెరుగుతుంది. ఇందుకు సంబంధించిన ఫైల్ ప్రభుత్వం వద్ద ఇప్పటికే ఉ



ందని, ఇంకా ఈ విషయంలో మరింత ఆలస్యం చేయకుండా అయిదుగురు సభ్యులతో కూడిన కమిటీ త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి అనుమతులు సాధించేందుకు కృషి చేయాలి. వీరిలో ముగ్గురు ఇతర విశ్వ విద్యాలయాలకు చెందిన వైస్ ఛాన్సలర్స్ సభ్యులుగా ఉంటారని కౌన్సిల్ తీర్మానించడం జరిగింది." అని తెలిపారు. గవర్నింగ్ సమావేశంలో వైస్ ఛైర్మన్ ఎం. నాగరాజు, చెన్నయ్ వెల్లూర్ టెక్నాలజీ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ రజత్ గుప్తా , ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కుమార్ మొలుగరం, జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, ఆస్కి మాజీడీన్ డాక్టర్ సుదర్శనం, డీఆర్డీఓ డైరెక్టర్ జనరల్ వి. రాజబాబు, రాయపూర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ రమణారావు , తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్, విమెన్ అండ్ ఇన్ ఫ్రా స్ట్రక్చర్ మేనేజింగ్ డైరెక్టర్ ఐ. గణపతి రెడ్డి, ఇనిస్టిట్యూట్ అఫ్ ఇంజనీర్స్ దుర్గాపూర్ మాజీ ఛైర్మెన్ సఫికుల్‌ఇస్లామ్, రాంకీఇన్ ఫ్రా స్ట్రక్చర్ డైరెక్టర్ డాక్టర్ పిజి. శాస్త్రి, తెలంగాణ కౌన్సిల్‌ఫర్‌హయ్యర్ ఎడ్యుకేషన్ నుండి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, డాక్టర్ సీరం సత్యనారాయణపలువురు సభ్యులు పాల్గొన్నారు.

# కశ్మీర్‌లో ఆపరేషన్ నాగ్ని.. భారీగా ఆయుధాలు పట్టివేత!

విశ్వంభర, నేషనల్ బ్యూరోః జమ్మూకశ్మీర్‌లో భద్రతా దళాలు ఎడతెరిపి లేకుండా ఆపరేషన్లు చేపడుతున్నాయి. తాజాగా కుప్వారాలో ప్రాంతంలో ఉగ్ర స్థావరాన్ని గుర్తించారు. దీనిలో పెద్దసంఖ్యలో ఆయుధాలు ఉన్నాయి. ఈ ఆపరేషన్‌కు నాగ్ని టాప్ అని పేరుపెట్టారు. పక్కా సమాచారం మేరకు సైన్యం, జమ్మూ కశ్మీర్ పోలీసులు, బీఎస్ఎఫ్ సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. ఈ విషయాన్ని చినార్ కోర్ 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసింది. ఇక్కడ ఒక తుపాకీ, 12 గ్రనేడ్లు, రెండు మ్యాగ్జైన్‌లు, ఇతర పేలుడు పదర్థాలు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే కుల్గాంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఆపరేషన్ అఖాల్‌లో ఇప్పటివరకు ముగ్గురు ఉగ్రవాదులను దళాలు మట్టుబెట్టిన విషయం తెలిసిందే. నేడు ఐదో రోజు కూడా ఇది కొనసాగుతోంది. ఇక 'ఆపరేషన్ మహాదేవ్'లో పహల్గాం నరమేధానికి పాల్పడిన ఉగ్రమూకను మట్టుపెట్టిన కొన్ని రోజుల్లోనే ఈ సైనిక చర్యలు



చోటుచేసుకోవడం గమనార్హం. జులై 30వ తేదీన ఆపరేషన్ శివ్‌శక్తిలో ఇద్దరు చొరబాటు దారులను భద్రతా దళాలు హతమార్చాయి. జమ్మూకశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దయి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా భారీ ఆయుధ డంప్ దొరకడం గమనార్హం.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు: మంత్రి శ్రీధర్ బాబు




విశ్వంభర, మేడ్చల్ టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గంలోని ఐదు మండలాల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వం అని ఉద్ఘాటించారు. పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా ఉండడానికి రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందచేస్తున్నామని అన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో 40 వేల రేషన్ కార్డులు అందచేసామని, మరో 60 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నవి పూర్తి కాగానే అందిస్తామని అన్నారు. లక్ష మంది రేషన్ కార్డులో చేర్పులు చేపడుతున్నట్లు తెలిపారు. గత పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వంలో మీ సేవల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగిన రేషన్ కార్డులు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను నెరవేర్చడంలో సఫలీకృతం అయ్యామని ఇంకా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా బీఆర్ఎస్, బీజేపీ అని లేకుండా అందరికీ సంక్షేమ పథకాలు ఫలాలు అందేలా చూస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీ లు ఏర్పాటు చేసి వారిని సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రేషన్ కార్డు ఉండటం సమాజంలో ఓ గుర్తింపు అని ఆరోగ్య శ్రీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ప్రధాన ఆధారం అని అన్నారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వజ్రేష్ యాదవ్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత

# నేడు ఆచార్య జయశంకర్ సార్ జయంతి


ప్రొఫెసర్ జయశంకర్ సార్

మూడున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షకు ప్రతీక, తెలంగాణ మట్టిగడ్డ తీర్చిదిద్దిన ముద్దుబిడ్డ, సైద్ధాంతిక పునాదిని ఏర్పరిచిన గొప్ప దార్శనికుడు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ జీవితం తెలంగాణకే స్ఫూర్తి దాయకం. ఆయన జీవించిన కాలమంతా ఒకే ఎజెండాతో బతికిండు. రాష్ట్ర సాధనే లక్ష్యంగా భావించిండు. తెలంగాణ ప్రాంత ప్రజల జీవితాన్ని విధ్వంసం చేస్తున్న ఆంధ్ర వలస పాలనకు వ్యతిరేకంగా ఈ ప్రాంత ప్రజల పక్షాన వకాల్తా తీసుకున్నడు. ఎవరెంత రెచ్చగొట్టినా, మానసికంగా దాడికి దిగినా, సంయమనం కోల్పోకుండా తన వాదనను ఏ మాత్రం తగ్గకుండా, సూటిగా జవాబు చెప్పిన మేధావి మన జయశంకర్ సార్. ఏడున్నర దశాబ్దాల తన జీవితానుభవం, ఆరు దశాబ్దాల ఉద్యమ చైతన్యం నేర్పిన పాఠాలతో ఎలాంటి సమస్య వచ్చినా, దాన్ని తేలికగా పరిష్కరించే ఆలోచన గల మహా మనిషి. తెలంగాణ ఎందుకు కావాలి? అన్న ప్రశ్నకు సరళమైన వ్యావహారిక భాషలో స్పష్టంగా పండితులతో పాటు పామరులకు కూడా వేలాది సభలలో, సమావేశాలలో కోట్లాది మందికి అర్థమయ్యేటట్లు, పూసగుచ్చినట్లు విడమర్చి చెప్పిండు. ఆయన ప్రతి మాట ఉద్యమానికి ప్రేరణ కలిగించింది. జయశంకర్ సార్ చూడడానికి సాదాసీదాగా కనిపించే వాడు. కానీ ఆయనది గంభీర స్వరం. అప్పటి ఉద్యమ నేత, ఇప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడేముందు ప్రతి సభలోనూ ముందుగా జయశంకర్ సార్... పుస్తకానికి ముందుమాట వలే ఆ సభలో ఆక్సిజన్ లాంటి మాటలను ముచ్చట రూపంలో అందించే వాడు. ఆ తర్వాతనే కెసిఆర్ భావోద్వేగాలతో మాట్లాడేవాడు. జయశంకర్ సార్ మాటల ప్రాధాన్యత దీన్నిబట్టి ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. మేధావులతో పాటు సామాన్య జనం సహితం అర్థం చేసుకునే విధంగా సమాజ చైతన్యానికి ఊపిరిలూదిండు. సప్రమాణమైన చర్చనే తప్ప, ఖచ్చితమైన తర్కమే తప్ప, వితండ వాదం మాట్లాడేవాడు కాదు. ఆయన భావన ఎంత స్పష్టంగా ఉంటదో వ్యక్తీకరణ కూడా అంతే స్పష్టంగా ఉంటది. నాడు ఉర్దూ మీడియంలో చదువుకున్న వాడు కాబట్టి, ఉర్దూను ఒక మతానికి సంబంధించిన భాషగా ఎవరైనా అంటే సహించే వాడు కాదు. అది తెలంగాణ ప్రజల భాష అని తెలియ చెప్పేవాడు. నిజానికి ఉర్దూలో ఆలోచించి, ఆంగ్లంలో అర్థం చేసుకుని తెలుగు భాషలో మాట్లాడే వాడు. ఒక మతానికి భాష ఉండవచ్చు, కానీ ఒక భాషకు మతం ఉండదు అనేది ఆయన అభిప్రాయం. ముల్కీ నాన్ ముల్కీ ఉద్యమం దగ్గరనుండి తెలంగాణ సిద్ధించే చివరి సంఘటనల వరకు జయశంకర్ సార్ జీవితం ప్రతి అంశానికి దగ్గరగా ముడి వేయబడింది. జయశంకర్ సార్ 1952లో అయ్యదేవర కాళేశ్వరరావు" ఆంధ్ర -తెలంగాణ" విలీన ప్రతిపాదన తెచ్చినప్పుడు దాన్ని తీవ్రంగా వ్యతిరేకించాడు. దానితో కాళేశ్వర రావు మాట్లాడుతూ... మీరు యువకులు, ఆవేశం తప్ప ఆలోచన ఉ ఒడదు. తెలంగాణ ప్రాంతం ఒక రాష్ట్రంగా ఉండజాలదు. మనుగడ సాగించలేదు. అది ఆంధ్రతో కలిస్తేనే తెలంగాణ ప్రయోజనాలు నెరవేరుతాయి అని అన్నప్పుడు దానికి ప్రతిఘటనగా " మేము అడుక్కుతినైనా బతుకుతం కానీ, ఆంధ్రులతో సోపతి చేయం" అని కరాఖండిగా చెప్పిండు. ఓపాలి... 1969 లో తెలంగాణ ఉద్యమం నడుస్తున్నప్పుడు ఆనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డి జయశంకర్ సార్ ను బెదిరిస్తూ.. " నేను తలుచుకుంటే నిన్ను ఇప్పటికిప్పుడే ఉద్యోగం నుండి తీసి వేయగలను " అన్నప్పుడు మన జయశంకర్ సారు ఏమాత్రం జంకకుండ" నీ బల్ల మీద పేపర్ ఉ ఒది, జేబులో పెన్ను ఉంది. వెంటనే ఆ పని చేయండి" అని సవాల్ విసిరాడు. సార్ మాటలు విన్న బ్రహ్మానంద రెడ్డి నోరెల్ల పెట్టిండు. అంటే సారు ఎంత ధైర్యవంతుడో, ఎంతటి ఎదిరించే స్వభావము ఉన్నదో నేటితరం అర్థం చేసుకోవచ్చు. ఎంతో నెనరు గల్ల మనిషి గనుకనే బతుకంతా తెలంగాణ దుఃఖాన్ని, గోసను గుండెల నిండ నింపుకుండు. అదే ఒరవడితో ప్రజలను చైతన్యం చేసిండు. ఎన్నాళ్ళకయినా తెలంగాణ వచ్చి తీరుతుందని, దానికి రాజకీయ ప్రక్రియ ముఖ్యమని గట్టిగా భావించి ప్రజలను కార్యోన్ముఖులు చేశాడు. ఒక్కోక్కసారి తెలంగాణ ప్రాంతంలో వేదికల మీద భిన్న రాజకీయ పార్టీలు భిన్నస్వరాలు వినిపించినప్పుడు జయశంకర్ సారు.. తెలంగాణ ఉద్యమ శక్తులు " సమైక్యం గా పని చేయాలె. వీలుకాకుంటే సమన్వయంతో నన్న పని చేయాలె. అది సాధ్యం కాకుంటే సమాంతరంగా పని చేసుకుంటూ పోవాలె". అంతేకానీ వ్యతిరేక దిశలో మనకు మనమే సంఘర్షించ వద్దు అని సారు పదేపదే చెబుతూ ఉండేవాడు. జయశంకర్ సార్ ను మితభాషి అనుకుంటారు. కానీ తనకు ఇష్టమైన వాళ్లతోటి గంటలకొద్దీ మాట్లాడిన సందర్భాలు కోకొల్లలు. మేధావులతో గడిపిన తీరు లెక్క లేనిది. అవసరమున్న చోట అవసరమున్న మేరకే మాట్లాడే సమయస్ఫూర్తి గల వక్త. ఆయనలో గొప్ప హాస్య చతురత కూడా ఉండేది . ఒకసారి సభలో ఉపన్యాసం చెబుతుంటే ఒకాయన లేచి ప్రసంగానికి అడ్డు తగిలి, " తెలంగాణ వస్తే ఏమొస్తుంది సార్? మళ్లీ ఇటువంటి దొంగలే కదా మనల్ని పరిపాలించేది" అన్నప్పుడు... దానికి సమాధానముగా సారు చిరునవ్వుతో.. " అవును గీ దొంగలే... ఇటువంటి వాళ్లే పరిపాలిస్తరు. కానీ ఆ దొంగలు తినంగా మిగిలింది ఇప్పటిలాగా ఏ రాజమండ్రి కో, ఏ విజయవాడకో ఇక్కడి సంపద తరలిపోదు కదా! తినంగ మిగిలింది ఈ ప్రాంత అభివృద్ధికే దోహద పడుతుంది కదా". అనగానే సభలో ఉన్న వాళ్లు పెద్దపెట్టున చప్పట్లు కొడుతూ జై తెలంగాణ నినాదాలు చేశారు. ప్రశ్నించిన వ్యక్తి దెబ్బకు తలదించుకుండు. అంటే ఇక్కడ ఆ వ్యక్తిని అవమానపరచడం కాదు కానీ, సరైన విధంగా వివరించి చెప్పడం ముఖ్యమని భావించాలి. ప్రజలకు తమ కష్టాలకు సంబంధించిన అనుభవం ఉంటది కానీ, కష్టాల వెంట ఉన్న వ్యవస్థాగత మూలాలకు సంబంధించిన ఎరుక ఉండదు. ఆ ఎరుకను, సోయిని తెలియజేయడమే విద్యావంతులు చేయవలసిన ముఖ్యమైన పని అని జయశంకర్ సారు మౌలిక సూత్రాన్ని పదే పదే బోధించాడు. జయశంకర్ సారు చదివింది అర్థశాస్త్రం అయినప్పటికీ, తెలుగు సాహిత్యం పై పూర్తి అవగాహన కలిగి ఉండేవాడు. ఎన్నో సాహిత్య ఘటనలను, కవిత్వాన్ని, పద్యాలను, కవులను అలవోకగా ఉటంకిస్తూ ఈ విషయాలన్నీ వివరించేవాడు. "తౌరాక్యాంధ్రము " పేరిట తెలంగాణలోని తెలుగును జంధ్యాల పాపయ్య శాస్త్రి లాంటి కవి పండితులు అవమానిస్తే, వారితో వాదనకు దిగి దీటుగా ఓడించినాడు మన జయశంకర్ సార్. తెలంగాణ ప్రాంతాన్ని ఏ ఒక్కరూ అవమానించినా, హేళన చేసి మాట్లాడినా సారు ఊరుకునేటోడు కాదు. దీటైన జవాబు చెప్పిన ఘటికుడు . తెలంగాణ కోసం తన జీవితాన్ని పూర్తిగా అంకితం చేసిన మహనీయుడు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటును సారు ప్రత్యక్షంగా చూడలేకపోయిండు. ఆయన రాసిన ప్రతి అక్షరం, చేసిన ప్రసంగాలు, ఇంటర్వ్యూలు సమగ్రంగా ఇప్పుడిప్పుడే అక్షర బద్ధమై ప్రజలకు చేరువవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం వచ్చినంక ఆయన జీవిత విశేషాలను పాఠ్యపుస్తకాలలో తీసుకురావడం, విశ్వవిద్యాలయానికి ప్రొఫెసర్ జయశంకర్ సార్ పేరు పెట్టడం, ప్రతి యేటా ఆయన జయంతి, వర్ధంతి సభలను ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించడం గర్వించదగ్గ విషయం. అయినప్పటికీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్దం గడిచినప్పటికీ ఏ ఆశయాల కోసమైతే తెలంగాణ సాధించుకున్నామో ముఖ్యంగా నిధులు నీళ్లు, నియామకాలు వంటి ఆశయాలు నేటికీ నెరవేరకపోవడం నేటి తరం ఆలోచించవలసిన విషయం. స్వరాష్ట్రంలో పాలించిన పాలకులు తెలంగాణ సంపదనంతా దోచుకున్నట్లే అనిపిస్తుంది. ఒక్కొక్కరు వందల కోట్లు సంపాదించారు. మిగులు బడ్జెట్ గా ఉన్న తెలంగాణ రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారింది. అభివృద్ధి అనుకున్నంత దిశలో సాగలేదనేది ప్రజల మాట. కనీసం ఉద్యోగులకు మొదటి తారీఖున జీతాలు ఇచ్చే పరిస్థితి లేకపోయింది. పరిస్థితి అంతా ఎదుటోడి ముందు నవ్వినట్లయింది. రెండు దఫాలుగా అధికారం ఇచ్చిన ప్రజలు మూడోసారి పాలకులను మార్చవలసిన పరిస్థితి ఏర్పడింది. కనీసం ఈ ప్రజా ప్రభుత్వంలోనైనా మిగిలిపోయిన అభివృద్ధి సాధిస్తుందేమో చూడాలి. జయశంకర్ సార్ చిరకాల వాంఛ " రైజింగ్ తెలంగాణ " సాధించడానికి, ఆయన సూచించిన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ఆ మార్గంలో పయనించడమే మనందరి ముందున్న ఏకైక లక్ష్యం. ఇదే ఆయనకు తెలంగాణ ప్రజానీకం ఇచ్చే ఘనమైన నివాళి కాగలదు.



– కోమటి రెడ్డి బుచ్చిరెడ్డి,
సెల్ : 9441561655

## స్వదేశీ ఉత్పత్తుల వినియోగం కూడా

# దేశసేవలో ఒక భాగం




1991లో స్వదేశీ జాగరణ మంచ్ స్థాపించినప్పటి నుండి, స్వదేశీ భావజాలాన్ని ప్రజల్లో నాటుతూ, ఆచరణలోకి తీసుకురావడానికి నిరంతర కృషి చేస్తోంది. స్వదేశీ, స్వావలంబనలపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థ ద్వారానే భారతం శాశ్వత అభివృద్ధి సాధించగలదని స్వదేశీ జాగరణ మంచ్ విశ్వాసం. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ అనిశ్చితులు పెరుగుతున్న ఈ కాలంలో... వ్యాపార మార్గాలు, చెల్లింపు విధానాలు, కరెన్సీలు ఆయుధాలుగా మారుతున్నాయి. అమెరికా, పాశ్చాత్య దేశాలు రక్షణాత్మక విధానాలు అవలంబిస్తూ అధిక పన్నులు, అన్యాయపూర్వక అడ్డంకులతో ప్రపంచ ఎగుమతులను అడ్డుకుంటున్నాయి. మరోవైపు, చైనా వంటి దేశాలు అధిక ఉత్పత్తి సామర్థ్యాన్ని ఉపయోగించి అతి తక్కువ ధరలో, నాసిరకం వస్తువులను డంప్ చేస్తూ, మన తయారీ రంగాన్ని బలహీనపరుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో స్వదేశీ ఆచరణ మన జాతీయ ప్రయోజనాలను కాపాడే ప్రధాన ఆయుధం. విదేశీ వస్తువుల వినియోగాన్ని తగ్గించడం, ముఖ్యంగా చైనా, టర్కీ వంటి శత్రుత్వ దేశాల వస్తువులు, సేవలను బహిష్కరించడం, విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుకు బదులుగా భారత విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం, స్థానిక ఉత్పత్తులు, శిల్పులను ప్రోత్సహించడం వంటి చర్యలు అవసరం. ఇవి దేశ ఆర్థిక శక్తిని పెంచి, స్థానిక ఉపాధి, వికేంద్రీకృత అభివృద్ధిని ప్రోత్సహిస్తాయి. జూన్ 12, 2025న, వ్యాపార, పరిశ్రమ, సామాజిక సంస్థల సహకారంతో ప్రారంభించిన 'స్వదేశీ సురక్షా ఔర్ స్వావలంబన్ అభియాన్' ద్వారా స్వదేశీ ఉద్యమానికి దేశవ్యాప్తంగా కొత్త ఊపు వచ్చింది. స్వాతంత్ర్య సమరంలో స్వదేశీ ఉద్యమం కేవలం రాజకీయ స్వేచ్ఛ కోసం కాదు... ఆర్థిక గౌరవం, సాంస్కృతిక స్వాభిమానం, నాగరిక సార్వభౌమత్వం కోసం కూడా జరిగింది. ఆ ఉద్యమం విదేశీ వస్తువుల బహిష్కరణ, దేశీయ ఉత్పత్తి పునరుద్ధరణ, స్వావలంబన ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణానికి పిలుపు ఇచ్చింది. ఇప్పుడు కూడా అదే స్ఫూర్తి అవసరం. కోవిడ్ వ్యాక్సిన్‌ను మన దేశంలో తయారు చేసి కోట్లాది ప్రాణాలను రక్షించడం, రక్షణ రంగంలో స్వావలంబన సాధించడం, అంతరిక్షం, డిజిటల్ రంగాల్లో స్వీయ శక్తిని చూపడం... ఇవన్నీ స్వదేశీ శక్తికి ఉదాహరణలు. చైనా తో మన వాణిజ్య లోటు 99.2 బిలియన్ డాలర్లకు చేరుకోవడం ఆందోళనకరం. చౌక, నాసిరకం వస్తువులు మన సూక్ష్మ పరిశ్రమలను దెబ్బతీస్తూ, ఉపాధిని నాశనం చేస్తున్నాయి. పైగా, ఈ ఆర్థిక లాభాలను చైనా సరిహద్దు దౌర్జన్యాలకు వినియోగిస్తోంది.

మన సైనికులు సరిహద్దులో కాపలా కాస్తున్నప్పుడు, మనం శత్రువుల ఖజానాను నింపడం సరైందా అని ఆలోచించాలి ? అమెజాన్, వాల్‌మార్ట్ (ఫ్లిప్‌కార్ట్) వంటి పాశ్చాత్య ఈ–కామర్స్ దిగ్గజాలు 21వ శతాబ్దపు ఈస్ట్ ఇండియా కంపెనీలుగా మారాయి. ఇవి చిన్న వ్యాపారులను కిందికి నెడుతూ, విధానాలను తమకు అనుకూలంగా మలుచుకుంటున్నాయి. స్వదేశీ తత్వం ప్రపంచం నుండి వేరుపడటం కాదు. అది దేశ ప్రయోజనాలను కాపాడే విధంగా విధానాలు, వ్యాపార నిర్ణయాలు, వినియోగపు అలవాట్లు ఉండాలనే సంకల్పం. ప్రతి రూపాయి దేశీయ ఉత్పత్తిని బలోపేతం చేయాలి... శత్రు దేశాల ఆకాంక్షలను లేదా భారత భవిష్యత్తుపై నిబద్ధత లేని సంస్థల లాభాలను పెంచకూడదు. అందుకోసం చైనా దిగుమతులపై నియంత్రణ, ఇతర దేశాలతో సముచిత వాణిజ్య ఒప్పందాలు, ఈ–కామర్స్ మోనోపోలీలపై నియంత్రణ, పీడన ధరలు, ప్రిఫర్డ్ సెల్లర్స్ విధానం, స్వంత బ్రాండ్ ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేయడం అవసరం. ప్రతి భారతీయుడు 'స్వదేశీ సురక్షా ఔర్ స్వావలంబన్ అభియాన్' లో భాగమై, స్వదేశీ ఆచరణతో భారతాన్ని మళ్లీ మహోన్నత దేశంగా తీర్చిదిద్దే కర్తవ్యాన్ని స్వీకరించాలి.

కర్నాటి శ్రీహరి
**స్వదేశీ జాగరణ మంచ్ విభాగ్ కో కన్వీనర్**
**ఉమ్మడి నల్లగొండ జిల్లా. – 9618010730**

## "ధర్మస్థల" సమాచారం

# ధ్వంసం చేశారట!



అదేమిటో!? పరిపాలనా సంబంధ ఆదేశాలతో గుర్తు తెలియని వ్యక్తుల మరణాలకు సంబంధించిన సమాచారం మొత్తాన్ని ధ్వంసం చేశారట. అది కర్ణాటక రాష్ట్రం. ధర్మ స్థల అనే పోలీస్ స్టేషన్. ప్రముఖ శైవ తీర్థ క్షేత్రం ధర్మస్థల ఈ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నది. 1998– 2014 మధ్య వందల మంది బాలికలు, యువతులు, స్త్రీల మృత దేహాలను ధర్మ స్థల పుణ్య క్షేత్ర పరిధిలో కొందరు పెద్దల ఒత్తిడి, బెదిరింపులకు భయపడి తానే పూడ్చి వేశానని అక్కడ గతంలో పనిచేసిన పారిశుధ్య కార్మికుడు ఒకరు చెప్పడం దేశ వ్యాప్త పెద్ద సంచలనం. ఈ సంగతిని ఆయన ఫిర్యాదు చేశారు. తొలుత ఆ ఫిర్యాదును పట్టించుకోలేదు. దానిపై దేశవ్యాప్తంగా పౌర సమాజం నుంచి వచ్చిన ఒత్తిడితో ఆ మరణాల దర్యాప్తు కోసం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఐటీ ప్రత్యేక దర్యాప్తు బృందం%రి%ను నియమించక తప్పలేదు. ఆ ఎస్ఐటీ దర్యాప్తు జరుగుతున్న క్రమంలోనే ఈ సమాచార ధ్వంసం సంగతి వెలుగులోకి వచ్చింది. ఇది పోలీసులు వారికి వారే చెప్పిన సంగతి కాదు. ఆ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తుల మరణాలకు సంబంధించిన సమాచారం కోరుతూ శరత్ అనే ఆర్టీఐ %ళి%సమాచార హక్కు చట్ట%శీరి%కార్యకర్త ఒకరు ధరఖాస్తు చేశారు. 2000–2015 మధ్య ఆ స్టేషన్ పరిధిలో గల్లంతైన, గుర్తు తెలియని వ్యక్తుల సమాచారాన్ని ఆయన కోరారు. ఆ సమాచారం మొత్తం తొలగించి వేశామనేది పోలీసులు నుంచి ఆయనకు వచ్చిన జవాబు. గుర్తు తెలియని ఒక వ్యక్తి మృత దేహాన్ని కుక్క నక్క లాంటి జంతువును పూడ్చివేసినట్లుగా జరిగిన ఉదంతంలో తాను ప్రత్యక్ష సాక్షిని అని శరత్ చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆ స్టేషన్ పోలీసుల నుంచి ఇలాంటి జవాబు రావడం చాలా చిత్రమైన సంగతి. అలాంటి సమాచారం తొలగించడం ఏమిటో!సాధారణంగా నేరాలకు సంబంధించిన సమాచారం కూడా తొలగించరు. సుదీర్ఘ కాలం ఆ సమాచార రికార్డులు పోలీస్ స్టేషన్ లోనే ఉంటాయి ఏదైనా ఆధారం లభించి సదరు కేసు పూర్తయ్యే వరకు ఆ సమాచారం తొలగించడానికి వీలు ఉండకూడదు కదా. ఎన్నేళ్లయినా అలాంటి సమాచారాన్ని సురక్షితంగా భద్రపరచాలి. దర్యాప్తు పూర్తి కాని కేసుల సమాచారాన్ని మరింత భద్రంగా కాపాడవలసిన పోలీసులు దానిని ధ్వంసం చేయడం ఏమిటో!

గందె గోవర్ధన్

# వాస్తవం చెప్పడానికి ఏ దేశం వాడైతే ఏమిటి?




ఎవరు చెబితే ఏమిటి? ఆక్రమణ ఆక్రమణే అవుతుంది కదా! ఆ సంగతిని ఎవరు చెప్పారనే చర్చ అర్థం లేనిది మాత్రమే అవుతుంది. సరిహద్దుల్లోని విస్తృత భారత భూభాగం %ళి%దాదాపు రెండు వేల చదరపు కిలోమీటర్ల%రి%న్ని పొరుగు దేశం చైనా ఆక్రమించిందని, ఆ సత్యాన్ని ప్రభుత్వం దాచి పెట్టిందనేది ప్రతిపక్ష నేత చేసిన చేస్తున్న ఆరోపణ. దీన్ని రాజకీయం చేయడం ఎందుకు? ఆ సంగతి చెప్పడానికి, చెప్పిన వ్యక్తి జాతీయతతో పని ఏమిటి? చెప్పినాయన దేశీయుడా? విదేశీయుడా? ఆయనకు దేశ భక్తి ఉన్నదా? లేదా? అనేవి ప్రశ్నలు ఏమిటి? ఈ అర్థం లేని వాదనలు ఎందుకు? జాతీయత, దేశ భక్తి అనే అసందర్భ ప్రస్తావనలు ఏమిటి ?వాస్తవం చెప్పడానికి ఏ దేశం వాడైతే ఏమిటి? అతని జాతీయత ఏదైతే ఏమిటి? ఆక్రమణ జరిగిందో? లేదో? అది సత్యమో? కాదో? సర్కారు చెప్పాలి. సర్కారు మాత్రమే చెప్పగలిగే సంగతి అది. ఈ విషయం చెప్పిన సందర్భంలో అస్లీ జాతీయత, నకిలీ జాతీయత అనేవి అర్థం లేని వాదనలు ఎందుకు?ఆక్రమణ జరిగిందా? లేదా? అనే సత్యం చెప్పవలసిన బాధ్యత ప్రభుత్వంలో ఉన్న వారిది మాత్రమే. ఆక్రమణ సంగతిని వివరించమని సర్కారును ప్రశ్నించాలి కదా విషయం చెప్పిన వ్యక్తి జాతీయతను ప్రశ్నించడం, నిందించడం, ఆయన శీలాన్ని శంకించడం లాంటి పనులకు అర్థవంతమైనవేనా ?అసలు విషయాన్ని తప్పుదోవ పట్టించే ఇలాంటి ప్రశ్నలు సరైనవి మాత్రం కావు. తెలిసిన, విశ్రమించిన విషయం చెబితే శీల పరీక్ష చేసుకోమని కోరడం ఏమిటి? అది నిజమో? కాదో? స్పష్టంగా వివరించి శీలాన్ని నిరూపించుకోవలసింది సర్కారు కదా. ఒకవేళ ఆక్రమణ జరిగి ఉంటే ఎలా జరిగింది? ఎంత భూమి అన్యాక్రాంతం అయ్యిందనే సంగతులను దేశ ప్రజలకు వివరంగా చెప్పాలి. ఆ భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలి? అది ప్రభుత్వంలో ఉన్నవారి కర్తవ్యం. ఈ సందర్భంలో ఇలాంటి చర్యలు చేపట్టడం ద్వారా దేశ భక్తిని నిరూపించుకోవలసింది కేవలం సర్కారు మాత్రమే.



# భారత్ మ్యాచ్ గెలుస్తుందని ముందే తెలిసిపోయింది: గంగూలీ



భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన ఐదో టెస్ట్ మ్యాచ్ ఆఖరి వరకూ ఉత్కంఠగా సాగింది. ఇంగ్లండ్ విజయానికి 7 పరుగులు అవసరం ఉన్న తరుణంలో సిరాజ్.. అట్కిన్సన్‌ని ఔట్ చేసి భారత్‌కు విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్ విజయంతో ఐదు టెస్ట్‌ల టెండూల్కర్-ఆండర్సన్ సిరీస్‌ని భారత్ 2-2 తేడాతో సమం చేసింది. అయితే ఐదో టెస్ట్ మ్యాచ్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసిన సిరాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. అంతేకాక.. అతన్ని యావత్ దేశమంతా కొనియాడుతుంది. ఈ క్రమంలో టీం ఇండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ కీలక వ్యాఖ్యలు చేశారు.భారత్ మ్యాచ్ గెలుస్తుందని తనకు ముందే తెలిసిపోయిందని గంగూలీ పేర్కొన్నారు. 'నాలుగో రోజు ఆట ముగిసిన తర్వాత టీం ఇండియా గెలుస్తుందనే నమ్మకం నాకు కలిగింది. పిచ్ బాగుంది, సిరాజ్, ప్రశిద్ధ్‌లు బౌలింగ్ చేసిన తీరు అద్భుతం' అని గంగూలీ పేర్కొన్నారు. గంగూలీ అన్నట్టుగానే నాలుగో రోజు వరుస ఓవర్లలో ప్రశిద్ధ్ రెండు వికెట్లు తీసి భారత్ విజయానికి బాటలు వేశాడు. ఇక ఐదో రోజు సిరాజ్ మూడు వికెట్లు, ప్రశిద్ధ్ 1 వికెట్ తీసి జట్టుకు విజయాన్ని అందించారు.

# రిపోర్టర్ కు దిమ్మతిరిగే సమాధానం ఇచ్చిన సిరాజ్

హైదరాబాద్: భారత్-ఇంగ్లాండ్ మధ్య జరిగిన టెస్టు సిరీస్ డ్రాగా ముగిసింది. సిరాజ్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో చివరి టెస్టులో భారత జట్టు ఘన విజయం సాధించింది. ఐదో టెస్టులో సిరాజ్ తొమ్మిది వికెట్ల తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలిచాడు. ఈ సందర్భంగా సిరాజ్‌ను ఓ రిపోర్టర్ ప్రశ్నించాడు. బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో ఓ మాదిరి ప్రదర్శన చేశారని, ఇప్పుడు అద్భుతంగా రాణించారని కారణం ఏంటని అడిగాడు. బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో 20 వికెట్లు తీశానని, ఇంగ్లాండ్‌తో జరుగుతున్న సిరీస్ లో 23 వికెట్లు తీశానని వివరణ ఇచ్చాడు. జట్టులో బుమ్రాను ఉన్నప్పుడు ప్రత్యర్థి బ్యాటర్లు మిగితా బౌలర్లపై దాడి చేస్తారని, లైన్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంగ్లాండ్‌పై బౌలింగ్ కోసం ప్రత్యేకంగా ఏమీ కష్టపడలేదని, కొన్నిసార్లు పరుగులు పోతుంటాయని, ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు ఎక్కువగా ప్రయత్నస్తానని సిరాజ్ తెలిపాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టు సిరీస్ అద్భుతంగా జరిగిందని, 2-2 సమం చేసిన సూపర్‌మెన్ అభినందనలు భారత మాజీ బ్యాట్స్‌మెన్ సచిన్ టెండూల్కర్ తెలిపారు. టెస్టు క్రికెట్ అనేది అత్యుత్తమైందని మరోసారి నిరూపితమైందని, శుభ్‌మన్ గిల్ నాయకత్వం బాగుందని, కోచింగ్ బృందానికి టీమిండియా మాజీ కెప్టెన్ గంగూలీ అభినందించారు.



ఐదు టెస్టులో బౌలర్లు అద్భుతమైన ప్రదర్శన చేయడంతో టీమిండియా విజయం సాధించిందని భారత మాజీ బ్యాట్స్‌మెన్ విరాట్ కోహ్లీ తెలిపారు. సిరాజ్‌ను ప్రత్యేకంగా అభినందించాలని, శాయశక్తులా శ్రమిస్తాడని, అతడి ప్రదర్శన చాలా సంతోషంగా ఉందని విరాట్ పేర్కొన్నారు. కొన్ని మ్యాచ్‌లో ఓడిపోతాం, కొన్నింట్లో గెలుస్తామని, ఎప్పుడూ పోరాటం మాత్రం ఆపమని కోచ్ గౌతమ్ గంభీర్ తెలిపారు.

# ఆ ప్లాన్ ఫెయిలైంది.. అందుకే సిరాజ్‌కి కోపం వచ్చింది: గిల్



ఓవల్ వేదికగా ఇంగ్లండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన ఐదో టెస్ట్‌లో భారత్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో విజయంతో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ని భారత్ 2-2 తేడాతో సమం చేసింది. అయితే ఐదో టెస్ట్ మ్యాచ్‌లో భారత్ విజయానికి ఒక వికెట్ అవసరం ఉండగా.. ఇంగ్లండ్ బ్యాటర్ అట్కిన్సన్ కాసేపు టెన్షన్ పెట్టాడు. ఒక ఎండ్‌లో గాయంతో ఉన్న క్రిస్ వోక్స్ ఉండగా.. తానే స్ట్రైకింగ్ చేస్తూ.. ఇంగ్లండ్‌కి విజయాన్ని అందించేందుకు కృషి చేశాడు. కానీ, మొత్తానికి అతను సిరాజ్ బౌలింగ్‌లో ఔట్ కావడంతో భారత ఆటగాళ్లు ఊపిరి పీల్చుకున్నారు.అయితే చివరి వికెట్ తీసేందుకు భారత పేసర్ సిరాజ్ అన్ని విధాలుగా ప్రయత్నించాడు. ఒక సందర్భంలో భారత్‌కు వచ్చిన రనౌట్ అవకాశాన్ని కీపర్ ధృవ్ జురేల్ చేజార్చుకున్నాడు. అప్పుడు సిరాజ్ కాస్త కోపానికి గురయ్యాడు. అసలేం జరిగిందో కెప్టెన్ గిల్ మీడియాకు వివరించాడు. "వైడ్ యార్కర్ వేయాలని ముందే ప్లాన్ చేశాం. వోక్స్‌కి స్ట్రైక్ ఇవ్వకుండా అట్కిన్సన్ బ్యాటింగ్ చేస్తాడని తెలుసు. చివరి బంతికి సింగిల్ రాకుంటే వోక్స్ స్ట్రైక్‌కి వస్తాడు. కాబట్టి రన్ రాకుండా ఔట్ చేసేందుకు ముందే గ్లోవ్స్ తీసి ఉంచమని సిరాజ్, జురేల్‌తో చెప్పమన్నాడు. కానీ, నేను చెప్పేలోపే సిరాజ్ బౌలింగ్ వేయడం ప్రారంభించాడు. దాంతో రనౌట్ మిస్ అయింది. అందుకే అతనికి కోపం వచ్చింది. జురేల్‌కి ఎందుకు చెప్పలేదని సిరాజ్ ప్రశ్నించగా.. అక్కడ జరిగింది చెప్పాను. మాకు సిరాజ్‌పై పూర్తి నమ్మకం ఉంది. ఒక క్యాచ్ వదిలేసినంత మాత్రాన అతనిపై గౌరవం పోలేదు. అతను ఈ మ్యాచ్‌లో చేసిన కృషి అద్భుతం" అని గిల్ అన్నాడు.

## పాకిస్తాన్ ఛాంపియన్స్ పై 9 వికెట్ల భారీ తేడాతో ఘన విజయం

ఔజూ 2025 బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ (%ఔజూ%) ఫైనల్ మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా ఛాంపియన్స్ దుమ్ముదులిపారు. పాకిస్తాన్ ఛాంపియన్స్ పై 9 వికెట్ల భారీ తేడాతో ఘన విజయం సాధించి తొలిసారి చాంపియన్లగా నిలిచారు. చివరిసారి భారత్ ఛాంపియన్స్ గా నిలిచిన సంగతి తెలిసిందే. ఇకపోతే %ఔజూ% 2025 ఫైనల్ మ్యాచ్ మొత్తం ఏకపక్షంగా సాగింది. దీనికి కారణం ఎవరో కాదు.. ఏబీ డివిలియర్స్. అవును కేవలం 60 బంతుల్లోనే 120 పరుగుల అజేయ ఇన్నింగ్స్‌తో పాకిస్థాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఈ భీకర ఇన్నింగ్స్ లు కేవలం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గానే కాక, సిరీస్ మొత్తంలో 429 పరుగులు చేయడంతో 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా కూడా అందుకున్నాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే.. ముందుగా బ్యాటింగ్ చేసిన పాక్ ఛాంపియన్స్‌కు శుభారంభం లభించలేదు. కామ్రాన్ అక్మల్ తొందరగా ఔటవ్వగా.. కెప్టెన్ హాఫీజ్ కొద్దీమేర స్కోర్ చేసి వెనుదిరిగాడు. కానీ శర్జీల్ ఖాన్ 44 బంతుల్లో 76 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను సరిదిద్దాడు. ఆ తర్వాత ఉమర్ అమిన్ (36 నాటౌట్), ఆసిఫ్ అలీ (28) చివర్లో ఫర్వాలేదనిపించారు. ఇలా పాక్ మొత్తంగా 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 195 పరుగుల మంచి స్కోరునే చేసింది. ఇక సఫారీ బౌలర్లలో విల్జోయెన్, పర్నెల్ చెరో 2 వికెట్లు తీశారు.ఇక ఆ తర్వాత అసలు గేమ్ మొదలయింది. 196 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ప్రారంభంలో హాషీమ్ ఆమ్లా (18) త్వరగా వెనుదిరిగినా, ఆ తర్వాత ఏబీ డివిలియర్స్,




జేపీ డుమినీల జోడీ పాక్ బౌలింగ్‌పై విరుచుకుపడింది. ముఖ్యంగా డివిలియర్స్ శివతాండవం చేసాడని చెప్పవచ్చు. అతడు ఈ ఇన్నింగ్స్ లో తనదైన స్టైల్లో 12 ఫోర్లు, 7 సిక్సులతో 120 పరుగులు చేయగా, డుమినీ కూడా 50 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కేవలం 16.5 ఓవర్లలోనే విజయానికి అవసరమైన పరుగులను సాధించి విజయాన్ని సొంతం చేసుకున్నారు.

## ఆన్‌లైన్ మోసాలపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కీలక హెచ్చరిక




సైబర్ మోసాల పట్ల ప్రైవేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మంగళవారం కీలక హెచ్చరిక జారీ చేసింది. ముఖ్యంగా తమ బ్యాంకు కస్టమర్లు ఏపీకే(ఆండ్రాయిడ్ ప్యాకేజీ కిట్) మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏపీకే స్కామ్‌లో సైబర్ మోసగాళ్లు సాధారణంగా బ్యాంక్ ఉద్యోగులు లేదా ప్రభుత్వ అధికారుల పేర్లతో నటించి సోషల్ ఇంజనీరింగ్ వ్యూహాలను ఉపయోగిస్తున్నారు. కస్టమర్లతో మాట్లాడిన తర్వాత ఏపీకే ఫైల్స్ పంపి తమ స్మార్ట్‌ఫోన్‌లలో ఇన్‌స్టాల్ చేయమని కోరుతున్నారు. అనంతరం కస్టమర్ల స్మార్ట్‌ఫోన్‌లను తమ కంట్రోల్‌లోకి తీసుకుంటున్నారని, బ్యాంకు ఖాతాల్లో ఉండే సొమ్మును కాజేస్తున్నట్టు బ్యాంకు తెలిపింది. ఏవైనా మెసేజ్‌ల రూపంలో తమ ఫోన్‌కు ఏపీకే ఫైల్స్ వస్తే, అటువంటి వాటిని డౌన్‌లోడ్ చేయడం, ఉపయోగించడం లాంటిది చేయొద్దని స్పష్టం చేసింది. కస్టమర్లు థర్డ్ పార్టీ యాప్స్‌ను అస్సలు వాడొద్దని, ఏవైనా లింక్‌లు వస్తే అవి విశ్వసనీయమైనవేనా కాదా తనిఖీ చేసుకోవాలని పేర్కొంది. సైబర్ మోసగాళ్లు ఏపీకే ఫైల్స్‌ను స్మార్ట్‌ఫోన్‌లకు పంపి, వాటిని ఇన్‌స్టాల్ చేసేలా ప్రేరేపిస్తారు. ఆ త్ర్వాత సదరు ఫోన్‌లపై పూర్తి నియంత్రణ తీసుకుని కాల్స్, మెసేజ్‌లను మరొక డివైజ్‌కు షేర్ చేసుకుంటారు. ఆ తర్వాత కస్టమర్ ఫోన్‌లో ఉండే మొత్తం డేటాను దొంగిలిస్తారు. బ్యాంక్ ఖాతా యాక్సెస్ చేయవచ్చు, లావాదేవీలు నిర్వహించవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ హెచ్చరించింది.

## 11 నెలల గరిష్టానికి సేవల రంగ వృద్ధి

దేశీయ సేవా రంగ కార్యకలాపాలు పుంజుకున్నాయి. ప్రస్తుత ఏడాది జూలై నెలకు సంబంధించి ఈ రంగ వృద్ధి 11 నెలల గరిష్ఠానికి చేరింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ వ్యాపార కార్యకలాపాల సూచీ(పీఎంఐ) జూలైలో 60.5 పాయింట్లకు పెరిగింది. ప్రధానంగా అంతర్జాతీయ డిమాండ్ బలంగా ఉండటం, దేశీయంగా అమ్మకాలు కొనసాగడం వల్ల ఈ వృద్ధి నమోదైందని పీఎంఐ సూచీ వెల్లడించింది. సాధారణంగా 50 పాయింట్ల కంటే ఎక్కువ పీఎంఐ నమోదైతే కార్యకలాపాల వృద్ధి సానుకూలంగా, తక్కువ నమోదైతే క్షీణతగా పరిగణిస్తారు. గత నెలలో దీనికి మించి వృద్ధి నమోదైంది. గడిచిన నాలుగేళ్లుగా సేవల రంగం సానుకూలంగానే కొనసాగుతోంది. కొత్త వ్యాపారాల నుంచి ఆర్డర్లు రావడం, అంతర్జాతీయ వ్యాపారాలు బలంగా పెరగడం, సానుకూల డిమాండ్ ధోరణి, విక్రయాలు పెరగడం వంటి అంశాలు సేవల రంగం వృద్ధికి దోహదపడుతున్నాయి. సేవలకు సంబంధించి కొత్త ఆర్డర్లు, వ్యాపార కార్యకలాపాలు రెండింటిలోనూ ఫైనాన్స్, బీమా సంస్థలు ఎక్కువగా వినియోగించి అగ్రగామిగా నిలిచాయి. రియల్ ఎస్టేట్, వ్యాపార సేవలు వృద్ధి నెమ్మదించాయని గణాంకాలు పేర్కొన్నాయి. సేవల గిరాకీ బలంగా ఉన్నప్పటికీ ఉద్యోగాల సృష్టి 15 నెలల కనిష్టానికి చేరింది.

# పసిడి ధర పరుగో.. పరుగు.. మళ్లీ పెరుగుతున్న బంగారం రేట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 5 : దేశీయంగా బంగారం ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. మంగళవారం హైదరాబాద్‌లో 99.9 స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ 10 గ్రాముల రేటు రూ.820 పుంజుకొని రూ.1,02,220 వద్ద నిలిచింది. 99.5 స్వచ్ఛత కలిగిన 22 క్యారెట్ తులం విలువ రూ.750 ఎగిసి రూ.93,700 దగ్గర స్థిరపడింది. దీంతో గత నెల 23న నమోదైన ఆల్‌టైమ్ హై రికార్డు స్థాయి దరిదాపుల్లోకి మళ్లీ గోల్డ్ ప్రైస్ వచ్చినైట్టైంది. మునుపెన్నడూ లేనివిధంగా నాడు 24 క్యారెట్ తులం రూ.1,02,330 పలికింది. 22 క్యారెట్ రూ.93,800గా ఉన్నది. ఇదిలావుంటే ఢిల్లీలో 24 క్యారెట్ రేటు రూ.800 ఎగబాకి రూ.98,820గా ఉన్నట్టు అఖిల భారత సరఫా అసోసియేషన్ తెలిపింది. మార్కెట్‌లో బంగారంతోపాటు వెండికీ ఆదరణ కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే ఈ ఒక్కరోజే రూ.2,000 పెరిగి కిలో ధర ఢిల్లీలో రూ.1,12,000ను తాకింది. సాధారణ వినియోగదారులతోపాటు పారిశ్రామిక వర్గాల నుంచీ డిమాండ్ ఉందని, అందుకే నిన్నమొన్నటిదాకా తగ్గుతూపోయిన రేట్లు.. తిరిగి విజృంభిస్తున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ ప్రకంపనల నడుమ దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదొడుకులకు లోనవుతున్నాయి. ఫలితంగా ఇన్వెస్టర్లు సైతం తమ పెట్టుబడుల రక్షణార్థం.. గోల్డ్, సిల్వర్ వైపు చూస్తున్నారని నిపుణులు తాజా ట్రెండ్‌ను విశ్లేషిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో పుత్తడి ధర కొంతవరకు తగ్గుముఖం పట్టింది. న్యూయార్క్ స్పాట్ మార్కెట్‌లో 20.95 డాలర్లు లేదా 0.62 శాతం పడిపోయి ఔన్స్ రేటు 3,352.61 డాలర్లకు పరిమితమైంది. అయితే వెండి ధర మాత్రం స్థిరంగా 37.39 డాలర్ల వద్దే ఉన్నది. కాగా, ట్రంప్ సుంకాల బెదిరింపులు ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువను రికార్డు స్థాయి కనిష్ఠాల్లోకి దిగజార్చుతున్నదని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇది ఇలాగే సాగితే గోల్డ్, సిల్వర్ రేట్లు ఇంకా పెరిగే వీలుందని చెప్తున్నారు. అలాగే అమెరికా ఫెడ్ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్ల నిర్ణయం కూడా మార్కెట్‌ను ప్రభావితం చేస్తుందని అంటున్నారు. బంగారం ధరలు పడుతూలేస్తూ ఉండటంతో రిటైల్ మార్కెట్‌లో అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయని వ్యాపారులు తెలియజేస్తున్నారు. శ్రావణ మాసం వచ్చినా శుభకార్యాలకు తప్పక అవసరమైతేనే కొంటున్నారని జ్యుయెల్లర్స్ వాపోతున్నారు. ధరలు ఇంకా పెరిగితే రాబోయే పండుగ సీజన్‌లో విక్రయాలు ఆశించిన స్థాయిలో



ఉండకపోవచ్చన్న ఆందోళన వారిలో కనిపిస్తున్నది. ఇప్పటికే కస్టమర్లను ఆకట్టుకొనేందుకు రకరకాల ఆఫర్లను పెడుతున్నామని, అయినా స్పందన అరకొరగానే ఉంటుందని మెజారిటీ దుకాణదారులు చెప్తుండటం మార్కెట్‌లో నెలకొన్న స్తబ్ధతకు అద్దం పడుతున్నది.

# కష్టాల్లో పౌల్ట్రీ పరిశ్రమ.. సమస్యల్లో పెంపకందారులు



హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ రంగంగా ఉంటూ ఉపాధి, ఆదాయాలపరంగా పెద్దదైన కోళ్ల పెంపకం పరిశ్రమ.. పెను సమస్యలను ఎదురొంటోందని భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐకార్), పౌల్ట్రీ పరిశోధన డైరెక్టరేట్ (డీపీఆర్) అధ్యయనంలో వెల్లడైంది. వ్యాధి నిర్ధారణ కేంద్రాలకు, వైద్య సిబ్బంది కొరత ఉందని, టీకాలు తగినన్ని అందుబాటులో లేవని గుర్తించింది. గుడ్లు, చికెన్ ధరలలో అస్థిరత్వం ఈ రంగం ఎదుగుదలకు ప్రతిబంధకంగా మారినట్టు డీపీఆర్ తాజా నివేదికను విడుదల చేసింది. దేశీయంగా కోళ్లు, గుడ్ల ఉత్పత్తి, మాంసం లభ్యతలో తెలంగాణ రాష్ట్రం ముందు వరుసలో ఉందని డీపీఆర్ వెల్లడించింది. ఈ క్రమంలోనే ఇక్కడ 5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని పేర్కొంది. దేశంలోని కోళ్లలో రాష్ట్రంలోనే 9.39 శాతం ఉన్నాయి. రోజుకు 1,397.2 టన్నుల చికెన్ ఉత్పత్తి అవుతుండగా.. సగటున 5.04 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నట్టు తేలింది. అయితే వాణిజ్య కోళ్ల పెంపకం ఆధునిక సాంకేతికత, శాస్త్రీయ విధానాలతో కొనసాగుతుండగా.. నాటుకోళ్ల పెంపకం అసంఘటితంగా ఉన్నట్టు వెల్లడించింది. నిర్వహణలోనూ సంరక్షణ, మార్కెటింగ్ సమస్యలు ఎదురవుతున్నట్టు అధ్యయనం గుర్తించింది. రాష్ట్రంలో దాణా, పోషక విలువల పరిశీలన, పోషకాహార లోపాన్ని గుర్తించడానికి అవసరమైన ప్రయోగశాలలు సైతం అందుబాటులో లేవన్నది. నాటుకోళ్ల ఉత్పత్తి లాభదాయకమైనప్పటికీ వాటి సంరక్షణ సమస్యగా మారింది. వీటిని పెంచే ప్రాంతాలలో కుకలు, పిల్లులు, ఇతరత్రా జంతువుల వల్ల రైతులు పెంపకానికి వెనకాడుతున్నారు. పైగా వీటి గుడ్ల నిల్వకు శీతల గిడ్డంగుల సౌకర్యం లేక పెంపకందారులు ఎప్పటికప్పుడు వాటిని విక్రయిస్తున్నారు. అలాగే మొకజొన్న, సోయా వంటి దాణా ధరలు పెరగడంతో పెంపకం భారంగా మారింది. మార్కెట్ సైతం లాభసాటిగా లేదని వాపోతున్నారు. ఈ సవాళ్లను అధిగమించి, స్థిరమైన వృద్ధిని సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం పౌల్ట్రీ ఇండస్ట్రీకి తగినంత ప్రోత్సాహకాలు ఇవ్వాలని డీపీఆర్ శాస్త్రవేత్తలు రాజ్‌కుమార్, విజయ్‌కుమార్‌లు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

## ఈడీ ఎదుట అనిల్ అంబానీ




న్యూఢిల్లీ, ఆగస్టు 5: రిలయన్స్ గ్రూప్ చైర్మన్ అనిల్ అంబానీ మంగళవారం సెంట్రల్ ఢిల్లీలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట హాజరయ్యారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కేసుతో సంబంధమున్న బ్యాంక్ లోన్ మోసం కేసుల్లో అధికారులు అంబానీని ప్రశ్నించారు.కాగా, గ్రూప్ సంస్థలు బ్యాంకుల నుంచి మోసపూరితంగా రూ.17 వేల కోట్లకుపైగా రుణాలను తీసుకున్నాయన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే గత నెల 24న ముంబైలో రిలయన్స్ గ్రూప్‌నకు చెందిన 50 సంస్థల కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఉద్యోగులుసహా 25 మంది ఇండ్లలోనూ సెర్చ్ చేసిన సంగతి విదితమే.

## టాటా క్యాపిటల్ మెగా ఐపీవో

న్యూఢిల్లీ, ఆగస్టు 5 : బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ టాటా క్యాపిటల్.. దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ప్రవేశించేందుకు రంగం సిద్ధమవుతున్నది. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ వద్ద రూ.17,200 కోట్ల మెగా ఐపీవో కోసం అప్‌డేట్ చేసిన డ్రాఫ్ట్ పేపర్లను దాఖలు చేసింది. వీటి ప్రకారం మొత్తం 47.58 కోట్ల షేర్లను అమ్మకానికి పెట్టనున్నారు.ఇందులో 21 కోట్ల ఈక్విటీ షేర్లు ఫ్రెష్ ఇష్యూగా, 26.58 కోట్ల షేర్లు ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్)గా రానున్నాయి. కాగా, ఓఎఫ్ఎస్‌లో టాటా సన్స్ ద్వారానే 23 కోట్ల షేర్లు సేల్‌కు వస్తున్నాయి.





# సినిమా..
## జోరుగా పండగ సినిమాల షూటింగులు

తెలుగు చిత్ర పరిశ్రమకు కేరాఫ్‌గా చెప్పబడే హైదరాబాద్‌లో నటీనటులతో పాటు సాంకేతిక నిపుణులు నివాసం ఉంటుంటారు. (ఇతర భాషల వాళ్లు కూడా కొంతమంది). విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతి వంటి ప్రాంతాల్లో ఇటీవల షూటింగ్‌లు కొనసాగుతున్నాయి. సినిమా షూటింగ్‌లకు అనువైన స్టూడియోలు హైదరాబాద్‌తో పాటుగా దాని పరిసర ప్రాంతాల్లోనూ పెద్దఎత్తున ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకమైన సెట్టింగులు వేసి నిర్మాతలు చిత్రీకరణలు జరుపుతుంటారు. రాబోయేకాలంలో వినాయక చవితి, దసరా, దీపావళి, క్రిస్మస్ వంటి పండుగలు ఉన్నాయి. ఆయా సినిమాల విడుదలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం ఎక్కువగా హైదరాబాద్‌లోనూ, దాని పరిసర ప్రాంతాల్లోనూ సినిమా షూటింగ్‌లు పెద్దఎత్తున కొనసాగు తున్నాయి. ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రభాస్, పవన్ కల్యాణ్, నాగచైతన్య, రామ్ పోతినేని, విజరు సేతుపతి, సాయిదుర్గా తేజ్, తేజా సజ్జా, అఖిల్ అక్కినేని, సిద్ధు జొన్నలగడ్డ వంటి పలువురు కథానాయకుల సినిమాల షూటింగ్‌లు గత కొన్ని రోజులుగా జోరుగా సాగుతున్నాయి.

యాక్షన్ సన్నివేశాల్లో 'ఉస్తాద్ భగత్‌సింగ్': హరిహర వీరమల్లు సినిమా తర్వాత పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. 'గబ్బర్‌సింగ్' (2012) తర్వాత ఈ హిట్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రమిదే. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్నారు. పవన్‌కళ్యాణ్ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. క్లైమాక్స్‌లో భాగంగా కీలక సన్నివేనబకాంత మాస్టర్ పర్యవేక్షణలో అల్యూమినియం ఫ్యాక్టరీలో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో 'డాగన్': 'దేవర' వంటి హిట్ సినిమా తర్వాత ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్, సలార్' చిత్రాల ఫేమ్ ప్రశాంత్‌నీల్ దర్శకత్వం వహిస్తున్నారు. గుల్షన్‌కుమార్, భూషణ్‌కుమార్‌బీ టి. సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్ కల్యాణ్‌రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉంది. ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్ సిటీలో జరుగు తోంది. పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా వచ్చే ఏడాది జూన్ 25న విడుదలకానుంది.

పీపుల్స్ మీడియా స్టూడియోలో 'రాజా సాబ్': 'బాహుబలి' సినిమా తర్వాత ప్రభాస్ నటిస్తున్న చిత్రం 'రాజా సాబ్'. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో మాళవికా మోహనన్, నిధి అగర్వాల్ కథానాయికలు. టిజి విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్ సమీపంలోని అజీజ్ నగర్‌లో పీపుల్స్ మీడియా స్టూడియోలో జరుగుతోంది. ప్రభాస్‌తో పాటు ఇతర తారాగణంపై ముఖ్యమైన సన్నివేశాలను దర్శకుడు మారుతి చిత్రీకరిస్తున్నారు. చిత్రంలో ప్రభాస్ తండ్రీ కొడుకులుగా ద్విపాత్రాభినయం చేస్తున్నారు. బాలీవుడ్ నటుడు సంజరుదత్ తాత పాత్ర పోషిస్తున్నారు. కీలక సన్నివేశాలు మినహా దాదాపుగా సినిమా షూటింగ్‌ను మారుతి పూర్తిచేశారు. డిసెంబరు 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది.


శంకరపల్లిలో పెద్ది: రామ్‌చరణ్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'పెద్ది'. తొలి సినిమా 'ఉప్పెన'తో(2021) బ్లాక్‌బస్టర్ అందుకున్న బుచ్చిబాబు సానా 'పెద్ది'కి దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ కథానాయిక. శివ రాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతోన్న ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్ సమీపంలోని శంకరపల్లిలో జరుగుతోంది. రామ్‌చరణ్ పుట్టినరోజు సందర్భంగా 2026 మార్చి 27న విడుదల కానుంది. ఈ చిత్రానికి ఎఆర్ రెహమాన్ సంగీతం.

అన్నపూర్ణ స్టూడియోలో 'ఎన్‌సి 24 ':'తండేల్' సినిమాతో బ్లాక్‌బస్టర్‌ను అందుకున్న నాగచైతన్య తాజా చిత్రం 'ఎన్‌సి 24' (వర్కింగ్ టైటిల్)లో నటిస్తున్నారు. 'విరూపాక్ష' (2023) దర్శకుడు కార్తీక్ వర్మ దండు దర్శకత్వం వహిస్తున్నారు. మీనాక్షీ చౌదరి కథానాయిక. బాపినీడు సమర్పణలో సుకుమార్ రైటింగ్స్, శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌లో బివిఎస్‌ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోలో ఈ షూటింగ్ జరుగుతోంది.

ముచ్చింతల్‌లో'ఆంధ్ర కింగ్': రామ్‌పోతినేనికథానాయకుడిగా తెరకెక్కు తున్న సినిమా 'ఆంధ్ర కింగ్ తాలూకా'. 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' మూవీ ఫేమ్ పి.మహేష్‌బాబుదర్శకత్వంవహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. కన్నడ కథానాయకుడు ఉపేంద్ర, రావు రమేష్, మురళీ శర్మ, సత్య, రాహుల్‌రామకృష్ణ, విటివి గణేష్ ఇతర పాత్రలు పోషిస్తు న్నారు. శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో జరుగుతోంది.

మరికొన్ని చిత్రాల షూటింగ్ షురూ: అక్కినేని అఖిల్ కథానాయకుడిగా మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'లెనిన్' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లోని ఓ పాతభవనంలో జరుగుతోంది. సాయి దుర్గా తేజ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఎస్‌వైజీ' (సంబరాల యేటిగట్టు).రోహిత్ కేపీ దర్శకత్వంవహిస్తున్నఈ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి కథానాయిక. తుక్కుగూడలో షూటింగ్ కొనసాగుతోంది. తేజా సజ్జా నటిస్తున్న 'మిరారు' చిత్రం ఆర్‌ఎఫ్‌సిలో జరుగుతోంది. సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం'తెలుసు కదా'.రాశీ ఖన్నా, శ్రీనిధీశెట్టికథానాయికలు.శంకరపల్లిలో షూటింగ్ జరుగుతోంది.

# 'దేవర 2' సెట్స్ మీదకి అప్పుడేనా...!



నందమూరి తారక్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దేవర 2' చిత్రంపై ఓ ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వెలువ డింది. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' సినిమా షూటింగ్ పూర్తికాగానే, 'దేవర 2' సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధమవుతు న్నట్లు సమాచారం. దేవర చిత్రం విడుదలై మంచి విజయాన్ని నమోదు చేసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ మూవీ పార్ట్ 2కి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్, ప్రీ-ప్రొడక్షన్ పనుల్లో ప్రస్తుతం దర్శకుడు కొరటాల శివ తీరిక లేకుండా గడుపుతున్నట్లు తెలుస్తుంది. సోషల్ మీడియాలో వైరల్ వస్తున్న వార్తల ప్రకారం 'దేవర 2' షూటిం గ్ వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరిలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. మొదటిభాగం హిట్ అయిననేపథ్యంలో, రెండో భాగం కూడా అంతే స్థాయిలో అలరిస్తుందని అభిమానులు నమ్మకంతో ఉన్నారు. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా తారక్ కెరీర్‌లోనే మరో మైలురాయిగా నిలవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.

# అలా చేయడం అవమానకరం..

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ ఇటీవల కుబేర అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి హిట్ కొట్టారు. ఈ చిత్రం తమిళ ప్రేక్షకుల కన్నా తెలుగు ప్రేక్షకులనే ఎక్కువగా అలరించిది. ఇక ధనుష్ నటించిన రాంఝానా చిత్రం ఆగస్ట్ 1న మళ్లీ విడుదలైంది. 2013లో విడుదలైన ఈ చిత్రం ఇప్పుడు రీరిలీజ్ జరుపుకోగా , ఇందులో క్లైమాక్స్‌ను ఏఐ సాయంతో మార్చడంపై ధనుష్ తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ మార్పు వలన సినిమా ప్రమాదంలో పడుతుందంటూ సోషల్ మీడియాలో తన ఆవేదనను వ్యక్తం చేశారు ధనుష్. తన సోషల్ మీడియాలో.. "రాంఝానా" సినిమా కంటెంట్‌ను ఏఐతో మార్చడం బాధాకరం. ఇది నేను ఒప్పుకోలేదు.అయిన మార్చి ఆర్ట్, ఆర్టిస్ట్‌ని అవమానించారు. ఇలా చేయడం కథను చెప్పే విధానాన్ని మార్చడమే కాదు, సినిమా వారసత్వాన్ని హరించడమే. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా కఠిన నిబంధనలు అవసరం," అని స్పందించారు. సోనమ్ కపూర్ కథానాయికగా, ఆనంద్ ఎల్. రాయ్ దర్శకత్వంలో తెరకెక్కిన రాంఝానా సినిమాతో ధనుష్ బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వగా, అప్పట్లో ఈ చిత్రం మిక్స్‌డ్ టాక్ దక్కించుకుంది. అయితే రీ-రిలీజ్‌సమయంలో, ఏఐ సాయంతో క్లైమాక్స్‌ను మోడిఫై చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ చర్యను ధనుష్ ఖండించారు. 12 ఏళ్ల క్రితం చేసిన కృషికి ఇది సరైన న్యాయం కాదన్నారు. ధనుష్ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా తెగ వైరల్ అవుతోంది. అభిమానులు, సినీ ప్రముఖులు, ఇండస్ట్రీలోని పలువురు ఈ అంశంపై చర్చ ప్రారంభించారు. రాంఝానా టీమ్ దీనిపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సి ఉంది. ధనుష్ ఇటీవలే శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన "కుబేర" మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చి అలరించిన విషయం తెలిసిందే. నాగార్జున, రష్మిక మందన్నా ముఖ్య పాత్రల్లో నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. అలాగే ప్రస్తుతం ధనుష్ దర్శకత్వం వహిస్తున్న "ఇడ్లీ కాదై" చిత్రంపై కూడా మంచి అంచనాలున్నాయి.




# పాక్ క్రికెటర్‌తో తమన్నా పెళ్లి ..!
### అసలు విషయం చెప్పిన మిల్కీ బ్యూటీ



మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా పెళ్లి గురించి ఇటీవల అనేక ప్రచారాలు నెట్టింట హల్‌చల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తన పెళ్లి గురించి వస్తున్న పుకార్లపై స్పందించారు తమన్నా. మూడు పదుల వయసు దాటినా ఇంకా వివాహ బంధంలోకి అడుగుపెట్టని తమన్నా, పలువురిని వివాహం చేసుకోబోతుందని సోషల్ మీడియాలో జోరుగా వార్తలు వచ్చాయి. గత కొంతకాలంగా పాక్ మాజీ క్రికెటర్ అబ్దుల్ రజాక్‌ని పెళ్లి చేసుకోబోతున్నట్టు ప్రచారం జరగగా, తాజాగా ఈ రూమర్స్‌పై ఆమె స్పష్టత ఇచ్చారు. ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన తమన్నా సోషల్ మీడియాలో ఇలాంటి గాసిప్స్ ఎలా పుట్టుకొస్తాయో తెలియదు. గతంలో ఒకసారి జ్యువెల్లరీ షాపు ఓపెనింగ్ కోసం అబ్దుల్ రజాక్‌తో కలిసి వెళ్లాను. అంతే కానీ మాకు ఎటువంటి వ్యక్తిగత సంబంధం లేదు.ఒక పబ్లిక్ ఈవెంట్‌లో కలిసి కనిపించినంత మాత్రాన పెళ్లి రూమర్స్ రావడం ఆశ్చర్యంగా ఉంది అని తెలిపారు తమన్నా. అలాగే ఒకప్పుడు విరాట్ కోహ్లీతో డేటింగ్ చేసారన్న వార్తల గురించి కూడా మాట్లాడుతూ.. ఒక్కసారి మాత్రమే నేను విరాట్‌ను కలిసాను. ఆ క్షణమే అనేక రూమర్లు వచ్చాయి. ఆ టైంలో మానసికంగా చాలా ఇబ్బంది పడ్డాను. నిజానికి అప్పటి తరువాత మళ్లీ విరాట్‌ను కలిసే అవకాశమే రాలేదు అని తెలిపారు.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com